# తెలుగురాష్ట్రం

APTEL/2016/66202

తెలుగు దినపత్రిక

అమలాపురం | సంపుటి : 10 సంచిక : 140 | ఎడిటర్ : ఎ. రాజశేఖర్ | గురువారం 10 జులై 2025 | పేజీలు 8 వెల : 5/-

published : Amalapuram Vol:10 Issue : 140 10-07-2025 Editor : A.RAJASEKHAR Pages : 8 Rs: 5/-




మహిళలను అవమానిస్తే సహించం..
వైసీపీపై భువనేశ్వరి తీవ్ర ఆగ్రహం

2లో..

## ఏపీలో నేడు మెగా పేరెంట్ టీచర్ మీటింగ్

### ఒకేరోజు 2 కోట్ల మందితో రికార్డుకు సిద్ధం!


- నేడు రాష్ట్రవ్యాప్తంగా మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ 2.0
- ఒకేరోజు 2.28 కోట్ల మంది భాగస్వామ్యంతో రికార్డుకు సన్నాహాలు
- పుట్టపర్తిలో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ చేతుల మీదుగా ప్రారంభం
- మంత్రి లోకేశ్ ఆలోచనతో ప్రభుత్వ బడుల్లో ఈ కార్యక్రమం
- తల్లిదండ్రులకు విద్యార్థుల ప్రోగ్రెస్ కార్డుల అందజేత
- పాఠశాలల పనితీరుపై అభిప్రాయాలు, సూచనల స్వీకరణ

అమరావతి జులై 09 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఆంధ్రప్రదేశ్‌లో విద్యా వ్యవస్థను బలోపేతం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో భారీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. రేపు (గురువారం) రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని విద్యా సంస్థల్లో "మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ (పీటీఎం) 2.0" నిర్వహించనుంది. ఒకేరోజు దాదాపు 2.28 కోట్ల మందిని భాగస్వాములను చేస్తూ సరికొత్త రికార్డు సృష్టించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసింది. పుట్టపర్తి నియోజకవర్గంలోని కొత్తచెరువు జిల్లా పరిషత్ పాఠశాలలో జరిగే ప్రధాన కార్యక్రమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ హాజరుకానున్నారు. ఈ బృహత్తర కార్యక్రమంలో రాష్ట్రంలోని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కాలేజీలతో కలిపి మొత్తం 61 వేల విద్యా సంస్థలు పాలుపంచుకోనున్నాయి. ఈ సమావేశంలో 74.96 లక్షల మంది విద్యార్థులు, 3.32 లక్షల మంది ఉపాధ్యాయులు, కోటిన్నరకు పైగా తల్లిదండ్రులు, దాతలు, పూర్వ విద్యార్థులు పాల్గొననున్నారు. కార్పొరేట్ పాఠశాలలకే పరిమితమైన పేరెంట్ టీచర్ సమావేశాలను ప్రభుత్వ బడుల్లోనూ నిర్వహించాలన్న మంత్రి నారా లోకేశ్ ఆలోచనతో ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇది రెండో ముఖ్యమైన విద్యా సంబంధిత కార్యక్రమం కావడం గమనార్హం. ఈ సమావేశం ద్వారా తమ పిల్లల చదువు, ప్రవర్తన, ఇతర నైపుణ్యాల పురోగతిని తల్లిదండ్రులు నేరుగా ఉపాధ్యాయులను అడిగి

- తరువాయి 2లో..





## ప్రధానమంత్రి నరేంద్రమోదీకి నమీబియా అత్యున్నత పురస్కారం

- నమీబియా అత్యున్నత పౌర పురస్కారం అందుకున్న ప్రధాని మోదీ
- అవార్డును ప్రదానం చేసిన నమీబియా అధ్యక్షురాలు నెతుంబో నంది-ద్వైత్వా
- ఈ గౌరవం పొందిన తొలి భారత నేతగా మోదీ రికార్డు
- 2014 నుంచి మోదీకి ఇది 27వ అంతర్జాతీయ పురస్కారం
- ఆరోగ్యం, ఇంధన రంగాల్లో ఇరు దేశాల మధ్య నాలుగు ఒప్పందాలు
- ప్రస్తుత పర్యటనలో నాలుగు దేశాల నుంచి అత్యున్నత గౌరవాలు

భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన ఖాతాలో మరో అరుదైన అంతర్జాతీయ పురస్కారాన్ని చేర్చుకున్నారు. ఐదు దేశాల పర్యటనలో చివరిగా నమీబియాకు చేరుకున్న ఆయన, ఆ దేశ అత్యున్నత పౌర పురస్కారమైన 'ఆర్డర్ ఆఫ్ ది మోస్ట్ ఏన్షియంట్ వెల్‌విట్షియా మిరాబిలిస్'ను అందుకున్నారు. బుధవారం జరిగిన

- తరువాయి 2లో..



## ఈనెల 17న ఒక్క రైలును కదలనివ్వం : కవిత

- 42 శాతం బీసీ రిజర్వేషన్ల బిల్లును కేంద్రం ఆమోదించాలన్న కవిత
- ఎన్డీయేలో బీసీ వ్యతిరేకత పాతుకుపోయిందని విమర్శ
- స్థానిక ఎన్నికల్లో తెలంగాణ జాగృతి పోటీ చేయదని స్పష్టీకరణ

హైదరాబాద్ జులై 09 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

బీసీ రిజర్వేషన్ల అంశంపై కేంద్ర ప్రభుత్వంతో ప్రత్యక్ష పోరాటానికి సిద్ధమవుతున్నామని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. తెలంగాణ అసెంబ్లీ ఆమోదించిన 42 శాతం బీసీ రిజర్వేషన్ల బిల్లును కేంద్రం ఆమోదించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 17న తలపెట్టిన 'రైల్ రోకో'ను

- తరువాయి 2లో..




## నా పాలనకు నోబెల్ బహుమతి ఇవ్వాలి అరవింద్ కేజ్రీవాల్

- కేంద్రం అడ్డంకులు సృష్టించినా ఢిల్లీలో గొప్పగా పనిచేశానన్న కేజ్రీవాల్
- బీజేపీ తమ మొహల్లా క్లినిక్‌లను బుల్డోజర్లతో కూల్చివేసిందని ఆరోపణ
- గత నాలుగు నెలల్లో ఢిల్లీ పరిస్థితి దారుణంగా మారిందని విమర్శ
- ఉచిత విద్యుత్, నీరు, విద్య, వైద్యం తమ ప్రభుత్వ ప్రాధాన్యతలని స్పష్టం
- పంజాబ్‌లోని మొహాలీ సభలో కేజ్రీవాల్ ప్రసంగం

న్యూఢిల్లీ జులై 09 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఢిల్లీలో ముఖ్యమంత్రిగా తాను అందించిన పాలనకు గాను తనకు నోబెల్ బహుమతి ఇవ్వాలని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) జాతీయ కన్వీనర్, ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు సృష్టించినా తాను ఎంతో అభివృద్ధి చేశానని ఆయన స్పష్టం చేశారు. పంజాబ్‌లోని మొహాలీలో బుధవారం జరిగిన ఒక బహిరంగ సభలో

- తరువాయి 2లో..

### ఏపీకి పెట్టుబడులు రాకుండా..

## వైసీపీ కుట్రలు...

- 200 కంపెనీలకు మెయిల్స్..
- వైకాపా కుట్రలపై సీఎం చంద్రబాబు ఆగ్రహం
- చంద్రబాబు సంచలన వ్యాఖ్యలు..

అమరావతి జులై 09 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఏపీ కేబినెట్ భేటీలో సీఎం నారా చంద్రబాబు నాయుడు సంచలన వ్యాఖ్యలు చేశారు. సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కేబినెట్ భేటీలో చంద్రబాబు సంచలన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా వైసీపీ కుట్రలు చేస్తోందని చంద్రబాబు ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బ్రాండ్ ఇమేజ్ దెబ్బతీసేలా పలు కంపెనీలకు వైసీపీ మెయిల్స్ చేసిందంటూ చంద్రబాబు సంచలన ఆరోపణలు చేశారు. ఈ విషయంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ఈ వ్యవహారాన్ని ఏపీ కేబినెట్ భేటీలో ప్రస్తావించారు. ఏపీఎండీసీ బాండ్లలో పెట్టుబడులు పెట్టవద్దంటూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 200 సంస్థలకు మెయిల్ చేసిందని పయ్యావుల కేశవ్ ప్రస్తావించగా.. ఈ విషయంపై సీరియస్ అయిన చంద్రబాబు, విచారణకు ఆదేశిస్తామని ప్రకటించారు. మరోవైపు మంత్రులపైనా చంద్రబాబు అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఎవరూ కూడా సంతృప్తికరంగా పనిచేయడం లేదని అన్నట్లు సమాచారం. ఓ మహిళా ఎమ్మెల్యేను కించపరిచేలా, అభ్యంతరకరంగా మాట్లాడితే మంత్రులు ఎందుకు స్పందించలేదని చంద్రబాబు అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం. రాష్ట్రంలో ఏం జరుగుతోందనే దానిపై మంత్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏడాదిలో నిత్యావసర ధరలు తగ్గించామన్న చంద్రబాబు.. ఈ విషయాన్ని మంత్రులు ప్రజలకు చెప్పడంలో విఫలమయ్యారని అసంతృప్తి వ్యక్తం చేశారు. మరోవైపు ఆంధ్రప్రదేశ్ ఖనిజాభివృద్ధి సంస్థ బాండ్లు జారీ చేస్తూ ఉంటుంది. ఈ

- తరువాయి 2లో..



## పవన్‌ను కలిసిన ఏపీ బీజేపీ నూతన అధ్యక్షుడు

- జనసేన కార్యాలయంలో పవన్ ను కలిసిన మాధవ్
- మాధవ్ కు శుభాకాంక్షలు తెలిపిన పవన్
- కూటమి కార్యాచరణ, సమన్వయంపై కీలక చర్చలు



అమరావతి జులై 09 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తో రాష్ట్ర బీజేపీ నూతన అధ్యక్షుడు మాధవ్ భేటీ అయ్యారు. మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయానికి మాధవ్ వెళ్లారు. ఈ సందర్భంగా మాధవ్‌ను పవన్ శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఇది కేవలం మర్యాదపూర్వక భేటీగానే కాకుండా, రెండు పార్టీల మధ్య రాజకీయ సమన్వయంపై చర్చించేందుకు వేదికగా నిలిచింది. ఈ సమావేశంలో ప్రధానంగా కూటమి ప్రభుత్వ కార్యాచరణ, ప్రభుత్వంలో భాగస్వామ్యం, భవిష్యత్ రాజకీయ వ్యూహాలపై ఇరువురు నేతలు చర్చించారు. ముఖ్యంగా, మిత్రపక్షాలైన జనసేన, టీడీపీ, బీజేపీల మధ్య మరింత సమన్వయం పెంచుకోవడమే లక్ష్యంగా వీరి మధ్య చర్చలు జరిగినట్లు తెలుస్తోంది. కాగా, అంతకుముందు విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మాధవ్ పార్టీ నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ పదవికి ఆయన ఒక్కరే నామినేషన్ వేయడంతో ఆయన ఎన్నిక ఏకగ్రీవమైంది. గతంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, శాసనమండలిలో బీజేపీ ఫ్లోర్ లీడర్‌గా పనిచేసిన మాధవ్‌కు ఆర్ఎస్ఎస్, బీజేవైఎంలో పనిచేసిన సుదీర్ఘ అనుభవం ఉంది.

## గోదావరికి వరద ప్రవాహం

- భయాందోళనలో పోలవరం నిర్వాసితులు
- మెరక ప్రాంతాల్లోకి సామగ్రి తరలింపు

అమరావతి జులై 09 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



గోదావరికి వరద ప్రవాహం క్రమేపీ పెరుగుతోంది. బుధవారం భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 19 అడుగుల నుంచి 22.40 అడుగులకు చేరుకుంది. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే నుంచి 2,27,066 క్యూసెక్కుల వరద నీటిని అధికారులు దిగువకు విడుదల చేశారు. ప్రాజెక్టు స్పిల్ వే ఎగువన 28.250 మీటర్లు, దిగువన 18.680 మీటర్లు, ఎగువ కాఫర్ డ్యామ్‌కు ఎగువన 28.400 మీటర్లు, దిగువ కాఫర్ డ్యామ్‌కు దిగువన 17.750 మీటర్లు, ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌ల మధ్య 15.990 మీటర్ల నీటిమట్టం నమోదైంది. స్పిల్ వే 48 గేట్ల నుంచి వరద నీరు ప్రవహిస్తోంది. పోలవరం నుంచి పట్టిసీమ వరకు 26.987 మీటర్ల నీటిమట్టం నమోదైనట్లు, గురువారం నాటికి 2.82 లక్షల క్యూసెక్కుల జలాలు గోదావరిలోకి రానున్నట్లు సిడబ్ల్యుసి అధికారులు తెలిపారు. వారం రోజులుగా తగ్గుతూ పెరుగుతూ వస్తున్న గోదావరి వరద రెండు రోజుల నుంచి పెరుగుతూనే ఉండడంతో కుక్కునూరు మండల ప్రజల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. వేలేరుపాడు మండలంలోని రుద్రంకోట, రేపాకగొమ్ము, తదితర ప్రాంతాల్లోని నిర్వాసితులు మెరక ప్రాంతాల్లోకి, చల్లావారిగూడెం ఆర్అండ్ఆర్ కాలనీలలోకి తమ సామగ్రిని ట్రాక్టర్లపై, ఆటోల్లో తరలిస్తున్నారు. మన్యంలో కురుస్తున్న వర్షాలతో క్రమేపీ శబరి, సీలేరు నదుల్లో కూడా స్వల్పంగా నీటిమట్టం పెరుగుతూ వస్తోంది. గోదావరి సహా పలు నదులు, వాగుల్లో నీటి ప్రవాహాలు పెరుగుతుండటం పోలవరం నిర్వాసిత మండలాల ప్రజలను భయాందోళనకు గురిచేస్తోంది.



## నా పర్యటనను డైవర్ట్ చేయడానికే ప్రసన్నపై దాడి: జగన్ ఫైర్

- ప్రసన్నకుమార్ రెడ్డి ఇంటిపై దాడి పథకం ప్రకారమే జరిగిందన్న జగన్
- ప్రసన్నను అంతం చేయాలనే లక్ష్యంతోనే దాడి చేశారని ఆరోపణ
- రెడ్ బుక్ రాజ్యాంగంతో పైశాచిక ఆనందం పొందుతున్నారని మండిపాటు

అమరావతి జులై 09 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఏపీలోని కూటమి ప్రభుత్వంపై మరోసారి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. నెల్లూరు జిల్లా కోవూరు మాజీ ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఇంటిపై జరిగిన దాడిని ఖండిస్తూ, ఇది ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రోద్బలంతో జరిగిన హత్యాప్రయత్నమేనని సోషల్ మీడియా వేదికగా సంచలన ఆరోపణలు చేశారు. పోలీసుల సమక్షంలోనే టీడీపీకి చెందిన రౌడీలు ఈ దాడికి పాల్పడ్డారని

- తరువాయి 2లో..

తెలుగురాష్ట్రం దినపత్రిక

# సంపాదకీయం

## 'బ్రిక్స్' దేశాలపై అగ్రరాజ్యం అక్కసు

కొన్ని దేశాల పెడధోరణులను బ్రిక్స్ వేదికగా దునుమాడటంలో భారత్ ఎప్పుడూ ముందువరుసలో ఉంటుంది. ఈసారీ అదే సాంప్రదాయం కొనసాగింది. బ్రెజిల్ రాజధాని రియోడీ జనిరోలో జరిగిన సదస్సులో దక్షిణార్ధ గోళానికి (గ్లోబల్ సౌత్) జరుగుతున్న అన్యాయాన్ని ఎండగట్టడంలోనూ, ఉగ్రవాదంపై గోడమీది పిల్లివాటం ప్రదర్శిస్తున్న పలుదేశాల వైఖరిని తూర్పారబట్టడంలోనూ భారత ప్రధాని ఏమాత్రం వెనుకాడలేదు సరికదా, ఈసారి అంతర్జాతీయ సంస్థలు అనుసరిస్తున్న ద్వంద్వ ప్రమాణాలను సైతం కడిగి పారేశారు. రెండు అగ్రదేశాల ప్రతినిధులు.. రష్యా అధ్యక్షుడు పుతిన్, చైనా అధ్యక్షుడు జిన్ పింగ్ గైర్హాజరైన ఈ సదస్సును ముందుకు నడిపించడంలో ఆతిథ్య దేశం బ్రెజిల్‌తో కలిసి భారత్ కీలకపాత్ర పోషించింది.

భద్రతామండలి, ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటిఒ) వంటి అంతర్జాతీయ సంస్థలు తమను తాము సంస్కరించుకోవలసిన ఆవశ్యకతను ప్రధాని చాటిచెబుతూ, 21వ శతాబ్దపు సాఫ్ట్‌వేర్‌ను 20వ శతాబ్దపు టైప్ రైటర్లతో నడపలేమని చురకలంటించారు. ప్రపంచంలోనే అతిపెద్ద జనాభా కలిగిన భారత్‌కు భద్రతామండలిలో శాశ్వత సభ్యత్వం ఇప్పటికీ అందని ద్రాక్షగా ఉందన్న విషయాన్ని పరోక్షంగా ప్రస్తావిస్తూ, ప్రపంచ జనాభాలో మూడింట రెండు వంతులమందికి ఆయా సంస్థల్లో ప్రాతినిధ్యం లభించడం లేదని మండిపడ్డారు. దక్షిణార్ధ గోళానికి తగిన ప్రాముఖ్యం ఇవ్వలేని సంస్థలు సిమ్ కార్డు ఉండీ నెట్‌వర్క్ లేని మొబైల్ ఫోన్లవంటివేనని ఎద్దేవా చేశారు. ఇదే సదస్సులో భాగంగా శాంతిభద్రతలపై జరిగిన సమావేశంలో ప్రధాని పహల్గాం ఉగ్రదాడిని నేరుగా ప్రస్తావిస్తూ, ఉగ్రవాదానికి ఊతమిచ్చేవారిని, దానివల్ల నష్టపోయేవారినీ ఒకే గాటన కట్టకూడదని హెచ్చరించారు.

ఈ సందర్భంగా పహల్గాం ఉగ్రదాడిని బ్రిక్స్ సభ్యత్వ దేశాలు ముక్తకంఠంతో ఖండించడం ఆహ్వానించదగిన పరిణామం. రియో డీ జనీరో వేదికగా బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు జరుగుతుండగానే అగ్రరాజ్యాధినేత అమెరికా వ్యతిరేక విధానాలకు మద్దతు ఇచ్చే బ్రిక్స్ దేశాలపై అదనంగా 10 శాతం పన్నులు విధిస్తామంటూ బెదిరింపులకు దిగడం ఆయన తెంపరితనానికి అద్దం పడుతోంది. బ్రిక్స్ దేశాలపై అమెరికాకు ఏనాటినుంచో కడుపుమంట ఉంది. సుమారు పాతికేళ్ల క్రితం బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా దేశాలతో 'బ్రిక్'గా ఏర్పడిన ఈ కూటమి ఇంతై, వటుడింతై అన్న రీతిలో అంతకంతకూ విస్తరిస్తోంది. 2010లో దక్షిణాఫ్రికా చేరికతో 'బ్రిక్స్'గా పేరుమార్చుకున్న ఈ కూటమి ఇటీవలే ఈజిప్టు, ఇథియోపియా, ఇండోనేసియా, ఇరాన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ దేశాలకూ చోటు కల్పించింది. బ్రిక్స్ ప్రాధాన్యాన్ని గమనించిన మరో 20కి పైగా దేశాలు ఈ కూటమిలో చేరేందుకు ఆసక్తి కనబరుస్తున్నాయి.

బ్రిక్స్‌ను పాశ్చాత్య దేశాల ఆధిపత్యానికి తెరదించేందుకు ఏర్పడిన కూటమిగా అమెరికా, ఇతర ఐరోపా దేశాలూ భావిస్తున్నాయి. ముఖ్యంగా కూటమిలో చైనా, భారత్ ప్రాబల్యం పెరగడాన్ని అగ్రరాజ్యం జీర్ణించుకోలేకపోతోంది. డాలర్ పై ఆధారపడకుండా ప్రత్యామ్నాయాన్ని ఏర్పాటు చేసుకోవాలన్న బ్రిక్స్ దేశాల అభిమతాన్ని తప్పుపడుతోంది. బ్రిక్స్ దేశాలు డాలర్‌తో ఆటలు ఆడాలనుకుంటే తాము వాణిజ్యంతో వారికి చెక్ పెడతామంటూ ట్రంప్ చేసిన తాజా హెచ్చరికలు ఈ కోణంలోంచి అర్థం చేసుకోవాలి. ప్రపంచ జనాభాలో 46 శాతానికి బ్రిక్స్ దేశాలు ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. ప్రపంచ జిడిపిలో 35 శాతం వాటాను, చమురు ఉత్పత్తిలో 40 శాతం వాటాను కలిగి ఉన్న బ్రిక్స్ కూటమిపై పాశ్చాత్య దేశాలు ఎంతోకాలంగా తృణీకార ధోరణి కనబరుస్తున్నాయి. జి7 దేశాలు అమెరికాకు సానుకూలంగా ఉంటే, బ్రిక్స్ మాత్రం ఎటువైపూ ఒరగకుండా, తనదైన రీతిలో స్వతంత్ర ప్రతిపత్తితో ముందుకు సాగుతుండటం అగ్రరాజ్యానికి సైతం మింగుడుపటడం లేదు.

బ్రిక్స్ కూటమిలో ఉన్నంతమాత్రాన అమెరికాకు తాను వ్యతిరేకం కాదని తెలియజెప్పేందుకు అమెరికా, జపాన్, ఆస్ట్రేలియాతో కలసి భారత్ క్వాడ్ కూటమిగా ఏర్పడిందన్నది గమనార్హం. బ్రిక్స్ కూటమి పాశ్చాత్య దేశాలకు అసూయ పుట్టించేదిగా ఉన్నా, ఈ కూటమి మేడిపండును తలపిస్తోందన్న సంగతిని విస్మరించకూడదు. కూటమిలోని సభ్యత్వ దేశాల మధ్య ఎన్నో రాజకీయ, సైద్ధాంతిక విభేదాలు ఉన్నాయి. ముఖ్యంగా చైనా భారత్ మధ్య నెలకొని ఉన్న సరిహద్దు వివాదాల వంటివి కూటమి ఐక్యతకు తూట్లు పొడుస్తున్నాయి. బ్రిక్స్ దేశాలు తమ మధ్య ఉన్న విభేదాలను పరిష్కరించుకుని, ఆర్థిక, వ్యాపార బంధాలను బలపరచుకుంటే వర్ధమాన దేశాలకు చేయూతనిచ్చేందుకు ఆస్కారం కలుగుతుంది.

## మహిళలను అవమానిస్తే సహించం.. వైసీపీపై భువనేశ్వరి తీవ్ర ఆగ్రహం

- వైసీపీ నేత ప్రసన్నకుమార్ రెడ్డి వ్యాఖ్యలపై నారా భువనేశ్వరి తీవ్ర ఆగ్రహం
- ఇది మహిళల పట్ల వైసీపీకి ఉన్న ద్వేషానికి నిదర్శనమని విమర్శ
- ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డికి సంఘీభావం తెలిపిన భువనేశ్వరి
- అవమానకర వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్టు వెల్లడి
- స్త్రీల గౌరవాన్ని దెబ్బతీసే చర్యలను సహించబోమని స్పష్టీకరణ

అమరావతి జులై 09 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

వైసీపీ నేత ప్రసన్నకుమార్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు మహిళల పట్ల ఆ పార్టీకి ఉన్న ద్వేషాన్ని, వ్యతిరేక మనస్తత్వాన్ని బయటపెట్టాయని నారా భువనేశ్వరి తీవ్రస్థాయిలో విమర్శించారు. ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డిపై చేసిన అవమానకరమైన వ్యాఖ్యలను తాను తీవ్రంగా ఖండిస్తున్నానని, ఆమెకు తన పూర్తి సంఘీభావం ప్రకటిస్తున్నానని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా భువనేశ్వరి మాట్లాడుతూ... "మహిళల పట్ల వైసీపీ నేతల తీరు అత్యంత సిగ్గుచేటు. సమాజంలో ఇలాంటి వ్యాఖ్యలకు ఏమాత్రం స్థానం లేదు" అని అన్నారు. మహిళలను ఉద్దేశించి అవమానకరమైన పదాలు వాడినంత మాత్రాన వారి విలువ ఏమాత్రం తగ్గదని స్పష్టం చేశారు. మన సంస్కృతి, సంప్రదాయాలు స్త్రీల గౌరవాన్ని ఎప్పుడూ ఉన్నత స్థానంలో నిలబెట్టాయని గుర్తుచేశారు. స్త్రీల గౌరవానికి భంగం కలిగించే ఏ ప్రయత్నాన్నైనా ప్రతి ఒక్కరూ ముక్తకంఠంతో ఖండించాలని ఆమె పిలుపునిచ్చారు. మహిళలకు మద్దతుగా, వారి గౌరవాన్ని కాపాడటానికి అందరం ఐక్యంగా నిలబడాల్సిన అవసరం ఉందని భువనేశ్వరి చెప్పారు.



## అంతరిక్షంలో రైతు అవతారం.. మెంతి, పెసర పండిస్తున్న శుభాంశు శుక్లా

- రైతు అవతారమెత్తి మెంతి, పెసర మొక్కల పెంపకం
- జీరో గ్రావిటీలో మొక్కల పెరుగుదలపై అధ్యయనం
- భూమికి చేరాక మొలకలపై జన్యుపరమైన పరిశీలన
- ఆహారం, ఆక్సిజన్ కోసం మైక్రోఆల్గేపైనా ప్రయోగాలు
- యాక్సియం-4 మిషన్‌లో భాగంగా ఐఎస్ఎస్‌కు చేరిన శుక్లా



అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)లో భారత వ్యోమగామి శుభాంశు శుక్లా సరికొత్త ప్రయోగాలతో ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తున్నారు. ఆయన తాజాగా రైతు అవతారమెత్తి అంతరిక్షంలో మనందరికీ సుపరిచితమైన మెంతి, పెసర పంటలను పండిస్తున్నారు. గురుత్వాకర్షణ శక్తి లేని (జీరో గ్రావిటీ) వాతావరణంలో ఈ మొక్కల పెరుగుదల ఎలా ఉంటుందోనని ఆయన అధ్యయనం చేస్తున్నారు. ఈ ప్రయోగంలో భాగంగా, శుభాంశు శుక్లా గాజు పాత్రలలో మెంతి, పెసర విత్తనాలను నాటారు. ఐఎస్ఎస్‌లోని ప్రత్యేక నిల్వ ఫ్రీజర్‌లో వాటిని ఉంచి అవి మొలకెత్తే విధానాన్ని ఫొటోలు తీశారు. ఈ పరిశోధనలో ధార్వాడ్ వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన రవికుమార్ హొసమణి, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి చెందిన సుధీర్ సిద్దపురెడ్డి అనే ఇద్దరు శాస్త్రవేత్తలు శుక్లాకు సహకరిస్తున్నారు. యాత్ర ముగించుకుని భూమికి తిరిగి వచ్చాక, ఈ మొలకలలోని జన్యు మార్పులు, పోషక విలువలను విశ్లేషించనున్నట్లు యాక్సియం స్పేస్ సంస్థ తెలియజేసింది. వ్యవసాయ ప్రయోగాలతో పాటు శుభాంశు శుక్లా మరిన్ని కీలక పరిశోధనలు కూడా చేస్తున్నారు. జీరో గ్రావిటీలో ఆహారం, ఆక్సిజన్‌తో పాటు జీవ ఇంధనాలను ఉత్పత్తి చేసే సామర్థ్యంపై మైక్రోఆల్గేలను అధ్యయనం చేస్తున్నారు. అలాగే, మానవ మూలకణాలు (స్టెమ్ సెల్స్), వ్యోమగాముల మానసిక సామర్థ్యం, కండరాల పనితీరు వంటి అంశాలపైనా పరిశోధనలు కొనసాగిస్తున్నారు. ఈ ప్రయోగాల గురించి శుక్లా మాట్లాడుతూ, "భూమిపై ఉన్న పరిశోధకులకు, అంతరిక్ష కేంద్రానికి మధ్య వారధిగా ఉంటూ ఈ పరిశోధనలు నిర్వహించడం గర్వంగా, ఆనందంగా ఉంది" అని పేర్కొన్నారు. యాక్సియం-4 ప్రైవేట్ స్పేస్ మిషన్‌లో భాగంగా శుభాంశు శుక్లా గత వారమే మరో ముగ్గురు వ్యోమగాములతో కలిసి ఐఎస్ఎస్‌కు చేరుకున్న విషయం తెలిసిందే.

## ప్రధానమంత్రి నరేంద్రమోదీకి నమీబియా అత్యున్నత పురస్కారం

ఒక కార్యక్రమంలో నమీబియా అధ్యక్షురాలు నెతుంబో నంది-ద్వైత్వా ఈ గౌరవాన్ని ప్రధాని మోదీకి అందజేశారు. ఈ పురస్కారం పొందిన తొలి భారతీయ నేతగా ప్రధాని మోదీ నిలవడం గమనార్హం. 2014లో ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ఆయన అందుకున్న 27వ అంతర్జాతీయ పురస్కారం ఇది. ప్రధానమంత్రి హోదాలో నరేంద్ర మోదీ నమీబియాలో పర్యటించడం ఇదే తొలిసారి. ఈ పర్యటన సందర్భంగా ఆయన ఆ దేశ అధ్యక్షురాలితో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ఇరు దేశాల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేసే దిశగా ఆరోగ్య సంరక్షణ, ఇంధనం వంటి కీలక రంగాల్లో సహకారం కోసం నాలుగు ఒప్పందాలపై సంతకాలు చేశారు. కాగా, నమీబియాలో పర్యటించిన మూడో భారత ప్రధానిగా మోదీ నిలిచారు.ఈ నెల 2న ప్రారంభమైన ప్రధాని ఐదు దేశాల పర్యటనలో భాగంగా ఇప్పటికే ఘనా, ట్రినిడాడ్ అండ్ టొబాగో, అర్జెంటీనా, బ్రెజిల్ దేశాలను సందర్శించారు. బ్రెజిల్‌లోని రియోలో జరిగిన బ్రిక్స్ సదస్సులో కూడా పాల్గొన్నారు. ఈ పర్యటనలో అర్జెంటీనా మినహా మిగిలిన నాలుగు దేశాల అత్యున్నత పురస్కారాలను అందుకోవడం విశేషం.

## ఏపీలో నేడు మెగా పేరెంట్ టీచర్ మీటింగ్

### ఒకేరోజు 2 కోట్ల మందితో రికార్డుకు సిద్ధం!

తెలుసుకోవచ్చు. విద్యార్థుల సమగ్ర ప్రోగ్రెస్ కార్డులను ఈ సందర్భంగా తల్లిదండ్రులకు అందజేస్తారు. అంతేకాకుండా, పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, బోధన తీరుపై తల్లిదండ్రులు తమ అభిప్రాయాలను, సూచనలను ప్రభుత్వానికి తెలియజేసేందుకు ఇది ఒక చక్కటి వేదికగా ఉపయోగపడనుంది. ఈ కార్యక్రమాన్ని ఏటా పండుగ వాతావరణంలో నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

## ఈనెల 17న ఒక్కరైలును కదలనివ్వం : కవిత

విజయవంతం చేస్తామన్నారు. ఆ రోజు డెక్కన్ నుంచి ఢిల్లీ వైపు ఒక్క రైలును కూడా కదలనివ్వబోమని ఆమె కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమిలో బీసీ వ్యతిరేకత పాతుకుపోయిందని ఆమె తీవ్రస్థాయిలో విమర్శించారు. తాను ఓబీసీ అని చెప్పుకునే ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి, ఇప్పుడు బీసీ వర్గాలకు న్యాయం చేసే గొప్ప అవకాశం వచ్చిందని కవిత అన్నారు. తెలంగాణ పంపిన బీసీ రిజర్వేషన్ల బిల్లును కేంద్రం వెంటనే ఆమోదించేలా ఆయన చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 243(డి) ప్రకారం, పెంచిన రిజర్వేషన్లను అమలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వానికి పూర్తి అధికారం ఉందని, కేవలం ఒక జీవో జారీ చేస్తే సరిపోతుందని ఆమె గుర్తుచేశారు. ఇదే క్రమంలో, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలంగాణ జాగృతి పోటీ చేయబోదని, బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులకే తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని కవిత స్పష్టం చేశారు.

## నా పాలనకు నోబెల్ బహుమతి ఇవ్వాలి : అరవింద్ కేజ్రీవాల్

ఆయన ప్రసంగించారు. "ఢిల్లీలో మా ప్రభుత్వం అధికారంలో ఉన్నంత కాలం మమ్మల్ని సరిగ్గా పనిచేయనీయకుండా అడ్డుకున్నారు. అయినా ఎంతో పనిచేశాం. నేను చేసిన పనులకు, నా పాలనకు గాను నాకు నోబెల్ బహుమతి ఇవ్వాలని నేను భావిస్తున్నాను" అని కేజ్రీవాల్ పేర్కొన్నారు. బీజేపీ పాలనలో ఉన్న మున్సిపల్ కార్పొరేషన్ ద్వారా తమ మొహల్లా క్లినిక్‌లను బుల్డోజర్లతో కూల్చివేశారని ఆయన ఆరోపించారు. "మేం ఎన్నో కష్టాల మధ్య మొహల్లా క్లినిక్‌లు కడితే, వాళ్లు ఐదు క్లినిక్‌లను కూల్చివేశారు. దీనివల్ల వాళ్లకు ఏం లభించింది?" అని ఆయన ప్రశ్నించారు. గత నాలుగు నెలలుగా ఢిల్లీలో తమ పాలనాధికారాలు తగ్గిన తర్వాత, బీజేపీ అధికారంలోకి వచ్చాక పరిస్థితి దారుణంగా తయారైందని కేజ్రీవాల్ విమర్శించారు. "ప్రస్తుతం ఢిల్లీ ప్రజలకు ఆప్ విలువ తెలుస్తోంది. బీజేపీ పాలనలో మొహల్లా క్లినిక్‌లు మూతపడుతున్నాయి. ఆసుపత్రుల్లో ఉచిత మందులు, పరీక్షల సౌకర్యం ఆగిపోయింది. నగరం అంతా చెత్తతో నిండిపోయింది" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం ప్రతి కుటుంబానికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 20 వేల లీటర్ల ఉచిత నీటిని అందించిందని గుర్తుచేశారు. విద్య, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చామని తెలిపారు. దేశంలో రాజకీయ చర్చల స్వరూపాన్నే తాము మార్చేశామని, ఒకప్పుడు ప్రైవేటీకరణ గురించే మాట్లాడిన వారు ఇప్పుడు ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రుల గురించి చర్చిస్తున్నారని ఆయన వివరించారు.

## ఏపీకి పెట్టుబడులు రాకుండా.. వైసీపీ కుట్రలు...

బాండ్లలో పెట్టుబడులు వద్దంటూ వైసీపీ నేత, మాజీ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి.. ఉదయభాస్కర్ అనే వ్యక్తి ద్వారా సుమారు 200 కంపెనీలకు మెయిల్స్ చేయించారని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ఇటీవల ఆరోపించారు. అయితే కంపెనీలు చంద్రబాబు మీద నమ్మకంతో వాటిని పట్టించుకోకుండా బాండ్లు కొనుగోలు చేశాయన్నారు. ఉదయ్ భాస్కర్ మీద దేశద్రోహం కేసు పెట్టాలని.. వైఎస్ జగన్, బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డిలను కూడా విచారించాలని పయ్యావుల కేశవ్ చంద్రబాబును ఇటీవల కోరారు. తాజాగా ఈ అంశం ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గ సమావేశంలో ప్రస్తావనకు రాగా సీఎం చంద్రబాబు సీరియస్ అయ్యారు. విచారణకు ఆదేశిస్తామని ప్రకటించారు.

### పనితీరు బాగోకపోతే కొత్తవారికి అవకాశం

పనితీరు మెరుగుపరుచుకోకపోతే పదవులు ఉండవంటూ తన కేబినెట్ సహచరులకు ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర స్థాయిలో హెచ్చరికలు జారీ చేశారు. ప్రతిపక్షాలు చేసే దుష్ప్రచారాన్ని సమర్థంగా తిప్పికొట్టడంలో విఫలమైతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని స్పష్టం చేశారు. అమరావతిలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఆయన మంత్రుల పనితీరుపై కీలక వ్యాఖ్యలు చేశారు.ప్రస్తుత రాజకీయాలు కేవలం సబ్జెక్టు ఆధారంగా కాకుండా, ప్రచారాలపైనే ఎక్కువగా నడుస్తున్నాయని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో మంత్రులు అన్ని విషయాలపై సకాలంలో స్పందించాలని గట్టిగా సూచించారు. "విపక్షాల తప్పుడు ప్రచారాలను ఎప్పటికప్పుడే తిప్పికొట్టకపోతే ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుంది. మీరు సరిగా స్పందించకపోతే మీ స్థానంలో కొత్తవాళ్లు వస్తారు. ఇక మంత్రులు రోజులు లెక్కపెట్టుకోవాల్సి వస్తుంది" అని ఆయన హెచ్చరించారు. వైసీపీ నాయకులు మహిళల పట్ల కూడా అసభ్యంగా మాట్లాడుతున్నారని, వారి నిజ స్వరూపాన్ని ప్రజల ముందు ఉంచాల్సిన బాధ్యత మంత్రులపై ఉందని చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వానికి నష్టం కలిగించే ఏ చిన్న విషయాన్ని కూడా ఉపేక్షించవద్దని, ప్రజాక్షేత్రంలో వాస్తవాలను బలంగా వినిపించాలని ఆయన ఆదేశించారు.

## నా పర్యటనను డైవర్ట్ చేయడానికే ప్రసన్నపై దాడి: జగన్ ఫైర్

జగన్ ఆరోపించారు. ఆరుసార్లు ఎమ్మెల్యేగా పనిచేసిన ప్రసన్నకుమార్‌రెడ్డిని అంతం చేయాలనే లక్ష్యంతోనే ఈ దాడి జరిగిందన్నారు. వయసు పైబడిన ఆయన తల్లిని సైతం భయపెడుతూ టీడీపీ గూండాలు బీభత్సం సృష్టించారని, ఇది ప్రజాస్వామ్యంపై జరిగిన భయంకర దాడి అని జగన్ పేర్కొన్నారు. రాష్ట్ర రాజకీయాల్లో ఒక నేతను లక్ష్యంగా చేసుకుని ఇంత దారుణంగా దాడి చేయడం ఎప్పుడూ చూడలేదన్నారు. చిత్తూరు జిల్లాలో మామిడి రైతుల సమస్యలను తెలుసుకునేందుకు తాను చేపట్టిన పర్యటన నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఈ దాడికి కుట్ర పన్నారని జగన్ ఆరోపించారు. ప్రజా సమస్యలు చర్చకు రాకుండా, ఈ దాడి గురించే రాష్ట్రమంతా మాట్లాడుకోవాలనేది వారి పథకమని విమర్శించారు. చంద్రబాబు తన 'రెడ్ బుక్' రాజ్యాంగంతో ఇలాంటి దాడులు చేయిస్తూ పైశాచిక ఆనందం పొందుతున్నారని జగన్ మండిపడ్డారు. హింస ద్వారా, కక్ష సాధింపు రాజకీయాల ద్వారా ప్రతిపక్షం గొంతు నొక్కలేరని ప్రభుత్వాన్ని ఆయన హెచ్చరించారు.

# సింహాచలం గిరిప్రదక్షిణకు తరలిన భక్తజనం



**సింహాచలం జులై 09 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**
ఏడాదికోసారి వచ్చే సింహాచలం గిరి ప్రదక్షిణ కోసం ఎన్నో రోజుల నుంచి ఎదురు చూస్తుంటారు. ఆ పరమ పవిత్ర దినం నాడు సింహగిరి వరాహ లక్ష్మీ నరసింహుని గిరి చుట్టూ ప్రదక్షిణలు చేస్తే ఆ స్వామి అనుగ్రహం లభిస్తుందని, కోరిన కోర్కెలు తీరుతాయని కోట్లాది మంది భక్తుల ప్రగాఢ నమ్మకం. ఆ నమ్మకంతోనే గిరి ప్రదక్షిణకు లక్షల సంఖ్యలో భక్తజనం పాల్గొని పరవశించి పోతుంటారు. తెలుగు రాష్ట్రాల్లోనే కాదు.. పొరుగున ఉన్న ఒడిశా, చత్తీస్‌గఢ్, పశ్చిమ బెంగాల్ నుంచి భక్తులు వస్తుంటారు. 32 కిలోమీటర్ల మేర బుధ, గురువారాల్లో జరిగే ఈ గిరి ప్రదక్షిణకు అనూహ్య రీతిలో పోటెత్తారు. ఆయా ప్రాంతాల నుంచి ఊళ్లకు ఊళ్లే జన సందోహం తరలి వచ్చారు. సాధారణంగా బుధవారం మధ్యాహ్నం రెండు గంటలకు గిరి ప్రదక్షిణ మొదలవుతుంది. కానీ ఈ ఏడాది బుధవారం ఉదయం నుంచే భక్తులు స్వచ్ఛందంగా గిరి ప్రదక్షిణకు శ్రీకారం చుట్టేశారు. విశాఖ వీధులన్నీ సింహాద్రి నాథుని నామస్మరణ, సంకీర్తనలతో మారు మోగింది.

## గిరి ప్రదక్షిణ ఇలా..

బుధవారం మధ్యాహ్నం సింహాచలం కొండ దిగువన ఉన్న తొలిపావంచా వద్ద నుంచి సింహాద్రినాథుని నమూనా విగ్రహంతో ఉన్న పుష్పరథం ప్రారంభమైంది. ఈ రథాన్ని ఆలయ అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు జెండా ఊపి ప్రారంభించారు. జై సింహాద్రి అప్పన్నా, జై వరాహ లక్ష్మీనారాయణ అంటూ ఈ రథం వెంట లక్షలాది మంది భక్తజనం గిరి ప్రదక్షిణకు శ్రీకారం చుట్టారు. తొలిపావంచా నుంచి మొదలైన ఈ ప్రదక్షిణ పాత అడవివరం మీదుగా పైనాపిల్ కాలనీ, ముడసర్లోవ, హనుమంతవాక, విశాలాక్షినగర్, జోడుగుళ్లపాలెం, అప్పుఘర్, ఎంవీపీ కాలనీ, వెంకోజీపాలెం, ఇసుకతోట, హెచ్‌బీ కాలనీ, సీతమ్మధార, బాలయ్యశాస్త్రి లేఅవుట్, పోర్టు స్టేడియం, కంచరపాలెం, మాధవధార, మురళీనగర్, ఎన్‌ఏడీ జంక్షన్, గోపాలపట్నం బంకు, ప్రహ్లాదపురం, పాత గోశాల జంక్షన్ల మీదుగా తిరిగి తొలిపావంచా వద్దకు చేరుకోవడంతో 32 కి.మీల గిరి ప్రదక్షిణ పూర్తవుతుందన్న మాట. గిరి ప్రదక్షిణ జరిగే బుధ, గురువారాలు రెండు రోజులూ ఆలయ అధికారులు ఆర్జిత సేవలను రద్దు చేశారు. సుగంధ్రద్రవ్యాలు మిళితం చేసి సిద్ధం చేసిన మూడు మణుగుల (సుమారు 125 కిలోలు) శ్రీగంధాన్ని స్వామికి సమర్పిస్తారు. 32 కిలోమీటర్లు గిరి ప్రదక్షిణ చేయలేని భక్తుల కోసం ఆలయ ప్రదక్షిణకు అవకాశం కల్పించారు. వేకువజామున మూడు గంటల నుంచి ఆలయ వెలుపల నుంచి భక్తులను ప్రదక్షిణకు అనుమతిస్తారు. ఉత్తర, దక్షిణ గోపురాల వద్ద ర్యాంపులను ఏర్పాటు చేశారు. గురువారం వేకువజామున 5 గంటల నుంచి స్వామిని దర్శించుకునేందుకు భక్తులకు అనుమతిస్తారు.



## స్వచ్ఛందంగా ప్రసాద వితరణ..

గిరి ప్రదక్షిణకు వచ్చే భక్తుల కోసం సేవా దృక్పథం ఉన్న అనేక మంది స్వచ్ఛందంగా ఉచిత ప్రసాదాలు అందజేస్తారు. 32 కిలోమీటర్ల దారి పొడవునా అడగడుగునా టెంట్లు ఏర్పాటు చేసి మంచినీళ్లు, మజ్జిగ, పండ్లు, ఫ్రూట్‌సలాడ్లు, ఫలహారాలు, పులిహొూర, దద్దోజనం, చక్కెర పొంగలి, వేడి బాదంపాలు, బిస్కెట్లు.. ఇలా ఒకటేమిటి మరెన్నింటినో అపరిమితంగా పంపిణీ చేస్తున్నారు. ఇంకో విశేషమేమిటంటే.. కాలినడకతో అలసిపోయిన వృద్ధులు, మహిళలకు ఉపశమనం కలిగించేందుకు స్వచ్ఛంద పాదసేవకులూ అందుబాటులో ఉంటారు. వీరంతా పాదసేవకు పోటీ పడతారు. ఈ ఏడాది గిరి ప్రదక్షిణలోనూ ప్రసాద వితరణతో పాటు పాదసేవకులూ తమ సేవలను అందించడానికి పోటీపడుతున్నారు. వీరిలో వృద్ధులు, మహిళలు, యువతీ యువకులు, విద్యావంతులు ఉన్నారు.

## ఏర్పాట్లు ఇలా చేశారు..


ఇక గిరి ప్రదక్షిణలో పాల్గొనే భక్తుల సౌకర్యార్థం జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. ఆ దారిలో ఉండే పాఠశాలలు, కల్యాణ మండపాల్లో 14 చోట్ల విశ్రాంతి సదుపాయం కల్పించారు. అక్కడ మంచినీరు, మరుగుదొడ్లను సమకూర్చారు. 13 ప్రాంతాల్లో వాహనాల పార్కింగ్‌ను ఏర్పాటు చేశారు. గత ఏడాది గిరి ప్రదక్షిణ చేసి సింహాచలేశుని 88 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ఈ ఏడాది ఆ సంఖ్య లక్ష దాటుతుందని అంచనా వేస్తున్నారు. అందుకనుగుణంగా అదనపు క్యూలైన్లను ఏర్పాటు చేశారు. వేచి ఉండే భక్తులకు దద్దోజనం, కదంబం అందిస్తున్నారు. తొలిపావంచా వద్ద కొబ్బరికాయలు కొట్టేందుకు 40 కౌంటర్లు, 100 ఇనుప గడ్డర్లను సిద్ధం చేశారు. మరోవైపు బుధవారం ఉదయం 6 నుంచి గురువారం ఉదయం 6 గంటల వరకు వివిధ మార్గాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. జాతీయ రహదారి నుంచి సిటీలోకి వచ్చే వాహనాలను ప్రత్యామ్నాయ మార్గాల్లోకి మళ్లించారు.

## ఐదారు లక్షల మంది వస్తారని అంచనా..

ఈసారి గిరి ప్రదక్షిణకు ఐదారు లక్షల మంది భక్తులు వస్తారని అధికార యంత్రాంగం అంచనా వేసింది. ప్రతి 200 మీటర్లకు ఒకటి చొప్పున 132 తాగునీటి పాయింట్లు, 500 మరుగుదొడ్లు, ఆరు కంట్రోల్ రూమ్‌లు, ఐదు చోట్ల పబ్లిక్ అడ్రస్ సిస్టం, 32 వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వాటిని 18 నెట్‌వర్కింగ్ ఆస్పత్రులకు అనుసంధానం చేశారు. 18 అంబులెన్సులను సిద్ధంగా ఉంచి యాంటీ వీనమ్‌ను అందుబాటులో ఉంచారు. 109 చోట్ల 400 తాత్కాలిక మరుగుదొడ్లు, 120 శాశ్వత మరుగుదొడ్లు, ప్రతికూల ప్రాంతాల్లో సీసీ టీవీలను ఏర్పాటు చేశారు. ఇంకా 750 ఎల్‌ఈడీ దీపాలు అమర్చారు. అప్పుఘర్ వద్ద ఐదు బోట్లను, 60 మంది గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచారు. ఇంకా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అయ్యేలా చర్యలు చేపట్టారు. ఈ రెండు రోజులూ మద్యం దుకాణాలను మూసివేయించారు. భక్తుల కోసం 50 ఉచిత బస్సులను సమకూర్చారు. గిరి ప్రదక్షిణకు వచ్చే భక్తుల సంఖ్యను లెక్కించడం కోసం తొలిసారిగా ఏఐ సాంకేతికతను వినియోగించడం ఈసారి గిరి ప్రదక్షిణ ప్రత్యేకత.

## ట్రాఫిక్

జాతీయ రహదారి నుంచి నగరంలోకి వచ్చే వాహనాలను ప్రత్యామ్నాయ మార్గాల్లోకి మళ్లించారు. మూడు వేల మందితో పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. డిప్యూటీ కలెక్టర్ ర్యాంకు అధికారి పర్యవేక్షణలో ఎన్డీఆర్‌ఎఫ్, ఎస్డీఆర్‌ఎఫ్, ఫైర్, పోలీస్, వైద్య, విద్యుత్, రెవిన్యూ, జీవీఎంసీ, ఆర్‌అండ్‌బీ, రవాణా శాఖ అధికారులు, సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. భక్తులకు ఏ అవసరం వచ్చినా 1800-4250-0009, 0891-2507225 టోల్ ఫ్రీ నంబర్లను అందుబాటులో ఉంచారు.





# పెట్టుబడులకు సత్వా గ్రూప్ సుముఖత..
## లోకేష్ బెంగళూరు పర్యటన సక్సెస్



**అమరావతి జులై 09 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించేందుకు మంత్రి నారా లోకేష్ చేపట్టిన బెంగళూరు పర్యటన మంచి ఫలితాన్నిచ్చింది. బెంగళూరులో ప్రముఖ రియాలిటీ సంస్థ సత్వా గ్రూప్ ప్రతినిధులతో మంత్రి లోకేష్ నిర్వహించిన చర్చలు విజయవంతమయ్యాయి. ఈ సమావేశం జరిగిన కొన్ని గంటల్లోనే, సత్వా గ్రూప్ ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టేందుకు సుముఖత వ్యక్తం చేస్తూ ప్రకటన చేసింది. విశాఖపట్నంలో 'వాంటేజ్ ప్రాజెక్టు' పేరుతో గ్రేడ్-ఎ ఆఫీసులు, ప్రీమియం రెసిడెన్షియల్ యూనిట్లు, స్టార్ట్ అర్బన్ సదుపాయాలను ఏర్పాటు చేయనున్నట్లు సంస్థ తెలిపింది. రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో నిలిపేందుకు అనువైన వాతావరణాన్ని కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి లోకేష్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.




# 'బ్రిక్స్' దేశాలపై అగ్రరాజ్యం అక్కసు




**అమరావతి జులై 09 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**
కొన్ని దేశాల పెడధోరణులను బ్రిక్స్ వేదికగా దునుమాడటంలో భారత్ ఎప్పుడూ ముందువరుసలో ఉంటుంది. ఈసారీ అదే సాంప్రదాయం కొనసాగింది. బ్రెజిల్ రాజధాని రియోడీ జనిరోలో జరిగిన సదస్సులో దక్షిణార్ధ గోళానికి (గ్లోబల్ సౌత్) జరుగుతున్న అన్యాయాన్ని ఎండగట్టడంలోనూ, ఉగ్రవాదంపై గోడమీది పిల్లివాటం ప్రదర్శిస్తున్న పలుదేశాల వైఖరిని తూర్పారబట్టడంలోనూ భారత ప్రధాని ఏమాత్రం వెనుకాడలేదు సరికదా, ఈసారి అంతర్జాతీయ సంస్థలు అనుసరిస్తున్న ద్వంద్వ ప్రమాణాలను సైతం కడిగి పారేశారు. రెండు అగ్రదేశాల ప్రతినిధులు.. రష్యా అధ్యక్షుడు పుతిన్, చైనా అధ్యక్షుడు జిన్ పింగ్ గైర్హాజరైన ఈ సదస్సును ముందుకు నడిపించడంలో ఆతిథ్య దేశం బ్రెజిల్‌తో కలిసి భారత్ కీలకపాత్ర పోషించింది. భద్రతామండలి, ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటిఒ) వంటి అంతర్జాతీయ సంస్థలు తమను తాము సంస్కరించుకోవలసిన ఆవశ్యకతను ప్రధాని చాటిచెబుతూ,( %ూతీఱఎవ వీఱఅఱర్‌వతీ ర్‌తీవంంవస అవవస%) 21వ శతాబ్దపు సాఫ్ట్‌వేర్‌ను 20వ శతాబ్దపు టైప్ రైటర్లతో నడపలేమని చురకలంటించారు. ప్రపంచంలోనే అతిపెద్ద జనాభా కలిగిన భారత్‌కు భద్రతామండలిలో శాశ్వత సభ్యత్వం ఇప్పటికీ అందని ద్రాక్షగా ఉందన్న విషయాన్ని పరోక్షంగా ప్రస్తావిస్తూ, ప్రపంచ జనాభాలో మూడింట రెండు వంతులమందికి ఆయా సంస్థల్లో ప్రాతినిధ్యం లభించడం లేదని మండిపడ్డారు. దక్షిణార్ధ గోళానికి తగిన ప్రాముఖ్యం ఇవ్వలేని సంస్థలు సిమ్ కార్డు ఉండీ నెట్‌వర్క్ లేని మొబైల్ ఫోన్లవంటివేనని ఎద్దేవా చేశారు. ఇదే సదస్సులో భాగంగా శాంతిభద్రతలపై జరిగిన సమావేశంలో ప్రధాని పహల్గాం ఉగ్రదాడిని నేరుగా ప్రస్తావిస్తూ, ఉగ్రవాదానికి ఊతమిచ్చేవారిని, దానివల్ల నష్టపోయేవారినీ ఒకే గాటన కట్టకూడదని హెచ్చరించారు. ఈ సందర్భంగా పహల్గాం ఉగ్రదాడిని బ్రిక్స్ సభ్యత్వ దేశాలు ముక్తకంఠంతో ఖండించడం ఆహ్వానించదగిన పరిణామం. రియో డీ జనీరో వేదికగా బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు జరుగుతుండగానే అగ్రరాజ్యాధినేత అమెరికా వ్యతిరేక విధానాలకు మద్దతు ఇచ్చే బ్రిక్స్ దేశాలపై అదనంగా 10 శాతం పన్నులు విధిస్తామంటూ బెదిరింపులకు దిగడం ఆయన తెంపరితనానికి అద్దం పడుతోంది. బ్రిక్స్ దేశాలపై అమెరికాకు ఏనాటినుంచో కడుపుమంట ఉంది. సుమారు పాతికేళ్ల క్రితం బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా దేశాలతో 'బ్రిక్'గా ఏర్పడిన ఈ కూటమి ఇంతై, వటుడింతై అన్న రీతిలో అంతకంతకూ విస్తరిస్తోంది. 2010లో దక్షిణాఫ్రికా చేరికతో 'బ్రిక్స్'గా పేరుమార్చుకున్న ఈ కూటమి ఇటీవలే ఈజిప్టు, ఇథియోపియా, ఇండోనేసియా, ఇరాన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ దేశాలకూ చోటు కల్పించింది. బ్రిక్స్ ప్రాధాన్యాన్ని గమనించిన మరో 20కి పైగా దేశాలు ఈ కూటమిలో చేరేందుకు ఆసక్తి కనబరుస్తున్నాయి. బ్రిక్స్‌ను పాశ్చాత్య దేశాల ఆధిపత్యానికి తెరదించేందుకు ఏర్పడిన కూటమిగా అమెరికా, ఇతర ఐరోపా దేశాలూ భావిస్తున్నాయి. ముఖ్యంగా కూటమిలో చైనా, భారత్ ప్రాబల్యం పెరగడాన్ని అగ్రరాజ్యం జీర్ణించుకోలేకపోతోంది. డాలర్ పై ఆధారపడకుండా ప్రత్యామ్నాయాన్ని ఏర్పాటు చేసుకోవాలన్న బ్రిక్స్ దేశాల అభిమతాన్ని తప్పుపడుతోంది. బ్రిక్స్ దేశాలు డాలర్‌తో ఆటలు ఆడాలనుకుంటే తాము వాణిజ్యంతో వారికి చెక్ పెడతామంటూ ట్రంప్ చేసిన తాజా హెచ్చరికలు ఈ కోణంలోంచి అర్థం చేసుకోవాలి. ప్రపంచ జనాభాలో 46 శాతానికి బ్రిక్స్ దేశాలు ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. ప్రపంచ జిడిపిలో 35 శాతం వాటాను, చమురు ఉత్పత్తిలో 40 శాతం వాటాను కలిగి ఉన్న బ్రిక్స్ కూటమిపై పాశ్చాత్య దేశాలు ఎంతోకాలంగా తృణీకార ధోరణి కనబరుస్తున్నాయి. జి7 దేశాలు అమెరికాకు సానుకూలంగా ఉంటే, బ్రిక్స్ మాత్రం ఎటువైపూ ఒరగకుండా, తనదైన రీతిలో స్వతంత్ర ప్రతిపత్తితో ముందుకు సాగుతుండటం అగ్రరాజ్యానికి సైతం మింగుడుపటడం లేదు. బ్రిక్స్ కూటమిలో ఉన్నంతమాత్రాన అమెరికాకు తాను వ్యతిరేకం కాదని తెలియజెప్పేందుకు అమెరికా, జపాన్, ఆస్ట్రేలియాతో కలసి భారత్ క్వాడ్ కూటమిగా ఏర్పడిందన్నది గమనార్హం. బ్రిక్స్ కూటమి పాశ్చాత్య దేశాలకు అసూయ పుట్టించేదిగా ఉన్నా, ఈ కూటమి మేడిపండును తలపిస్తోందన్న సంగతిని విస్మరించకూడదు. కూటమిలోని సభ్యత్వ దేశాల మధ్య ఎన్నో రాజకీయ, సైద్ధాంతిక విభేదాలు ఉన్నాయి. ముఖ్యంగా చైనా భారత్ మధ్య నెలకొని ఉన్న సరిహద్దు వివాదాల వంటివి కూటమి ఐక్యతకు తూట్లు పొడుస్తున్నాయి. బ్రిక్స్ దేశాలు తమ మధ్య ఉన్న విభేదాలను పరిష్కరించుకుని, ఆర్థిక, వ్యాపార బంధాలను బలపరచుకుంటే వర్ధమాన దేశాలకు చేయూతనిచ్చేందుకు ఆస్కారం కలుగుతుంది.

4




డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా

తెలుగురాష్ట్రం దినపత్రిక

https://epaper.teluguraastram.com

గురువారం 10 జులై 2025


# పేదల అభ్యున్నతికే సుపరిపాలన తొలి అడుగు'







**అల్లవరం జూలై 09,, (తెలుగురాష్ట్రం విలేకరి):** అల్లవరం మండలం, గుండెపూడి గ్రామంలో నిర్వహించిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు . ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, ఆముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, వేగిరాజు వెంకటరాజు, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ సత్తిబాబురాజు, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ కడలి వెంకటేశ్వరరావు, అల్లవరం చైర్మన్ దాట్ల గోపిరాజు, పచ్చిమాల ఏడుకొండలు, తోలేటి నానాజీ, సురేష్ రాజు, వడ్డి సుభాషిణి, గెద్దాడ శ్రీను, తోట నరసింహారావు, పోతుల నాగలక్ష్మి, తిక్కిరెడ్డి శ్రీను, గుబ్బల నాగేశ్వరావు, గుంటూరు బాల, వడ్డి రాంబాబు, అయితాబత్తుల శివ, యాళ్ల కాసుబాబు మరియు తదితరులు







# ఉప్పలగుప్తం కూనవరంలో సుపరిపాలన తొలిఅడుగులో పాల్గొన్న ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు





**ఉప్పలగుప్తం జూలై 09,, (తెలుగురాష్ట్రం విలేకరి):** సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా ఉప్పలగుప్తం మండలం, కూనవరం గ్రామంలో పాల్గొన్న ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, మాజీ శ్రీమతి అధికారి జయవెంకటలక్ష్మి బాబ్జీ, ఆకుల అచ్యుత రామమూర్తి, మాజీ దేశంశెట్టి లక్ష్మీనారాయణ, ఉప్పలగుప్తం మండల టిడిపి అధ్యక్షులు అరిగేలా నానాజీ, మండల ప్రధాన కార్యదర్శి పందు వెంకటేశ్వరరావు, వాకపల్లి ఈశ్వరి సత్యనారాయణ, ఆకుల బుజ్జి, ఆకుల వెంకటరమణ, రవణం మధు, పెయ్యల దుర్గారావు, చిక్కం కాసు, చీకట్ల ఏసుబాబు, మల్లాడి వెంకటరమణ, పెమ్మారెడ్డి సత్యనారాయణ, మధుర సత్యనారాయణ, ఆకుల వినోద్, పందు బాలగంగాధర్ తిలక్మరియు తదితరులు పాల్గొన్నారు





# అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తాం : ఎమ్మెల్యే అయితాబత్తుల






**అమలాపురం జూలై 09,, (తెలుగురాష్ట్రం విలేకరి):** అమలాపురం మండలం, నల్లమిల్లి గ్రామంలో జరిగిన సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొన్న గౌరవ ఎమ్మెల్యే శ్రీ అయితాబత్తుల ఆనందరావు గారు, ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, ఆముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, మాజీ శ్రీమతి అధికారి జయవెంకటలక్ష్మి బాబ్జి, మండల టిడిపి అధ్యక్షులు చొల్లంగి సాయిబాబు, దేవరపల్లి వీరేష్ కుమార్, మాజీ బొర్రా ఈశ్వరరావు, గోకరకొండ వాసు, విప్పర్తి రమణ, గోకరకొండ తాతలు, గోకరకొండ చంద్రావు, కేతా వెంకటేశ్వరరావు, నంద్యాల దొరబాబు, కర్రి పట్టాభిరామయ్య, చిక్కం స్వామినాయుడు, వాకపల్లి వెంకయ్య నాయుడు, కైరాం రాము, గోకరకొండ సుమంత్, గోసంగి ప్రసాద్, పరమట రమణ, బద్రి రాంబాబు, కర్రి బాలు మరియు తదితరులు





# జగన్మోహిని కేశవస్వామి అన్నదాన పధకానికి విరాళాలు.




**ఆత్రేయపురం: జూలై 09,, (తెలుగురాష్ట్రం విలేకరి):** ఆత్రేయపురం మండలం ర్యాలీ గ్రామంలో ప్రముఖ పుణ్యక్షేత్రం స్వయంభు శ్రీ జగన్మోహిని కేశవస్వామిని స్వామివారిని అనకాపల్లి జిల్లా అనకాపల్లి టౌన్ వాస్తవ్యులు దూరి శ్రీనివాస సుబ్రహ్మణ్య శాస్త్రి, సునీత దంపతులు దర్శించుకొని స్వామివారి అన్నదాన పథకానికి రూ.25,000 లు విరాళంగా సమర్పించారు. అలానే తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్ వాస్తవ్యులు జి.జనార్ధన్, కె. విశ్వనాథ శాస్త్రి, వి. శ్రీనివాస్ లు శ్రీ స్వామివారిని దర్శించుకుని స్వామివారి అన్నదాన పథకమునకు రూ.10,116 లు విరాళంగా సమర్పించారు. దాతలకు వేద ఆశీర్వచనం, శ్రీ స్వామి వారి శేష వస్త్రంతో సత్కరించి ఆలయ కార్యనిర్వహణాదికారి భాగవతుల వెంకట రమణమూర్తి, ఆలయ అర్చకులు, వేద పండిట్, ఆలయ సిబ్బంది దాతలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# వాడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వచ్ఛ భారత్ సమావేశం.



**ఆత్రేయపురం, జూలై 9 , (తెలుగురాష్ట్రం విలేకరి):** అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం వాడపల్లిలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో మంగళవారం స్వచ్ఛ భారత్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి తహశీల్దారు టి. రాజేశ్వరరావు అధ్యక్షత వహించగా, ఆలయ ఈవో, డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ, వాడపల్లిని ప్లాస్టిక్ రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు అందరూ కృషి చేయాలని కోరారు. ఆలయ ప్రాంగణంలోని వ్యాపారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి, ప్లాస్టిక్ వినియోగం నిషేధంపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని సూచించారు.వెంకటేశ్వర స్వామి ఆలయ పరిసరాలను శుభ్రంగా, పరిశుభ్రంగా ఉంచే దిశగా ప్రతి ఒక్కరూ సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

# దిండి గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు

**-పాల్గొన్న ఎంపీ హరీష్ బాలయోగి, ఎమ్మెల్సీ రాజశేఖర్**



**మలికిపురం, జులై 9, (తెలుగురాష్ట్రం విలేకరి):** డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రాజోలు నియోజకవర్గం దిండి గ్రామంలో జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో అమలాపురం పార్లమెంట్ సభ్యులు గంటి హరీష్ బాలయోగి, ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్ పాల్గొన్నారు. ముందుగా తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు నందమూరి తారక రామారావు, లోక్ సభ మాజీ స్పీకర్ జీఎంసీ బాలయోగి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం గ్రామంలో ఇంటింటికీ తిరిగి సంవత్సరం పూర్తి చేసుకున్న కూటమి పాలన చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించారు. గ్రామంలో సమస్యలను పరిష్కరిస్తామని ఎంపీ హరీష్ బాలయోగి అన్నారు.


## జాతీయస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో తిరుపతమ్మకు పసిడి పథకం



**జగ్గయ్యపేట, జూల్కై 9 (తెలుగురాష్ట్రం విలేకరి):** కర్ణాటక రాష్ట్రం దావనగిరిలో జూన్ నెల 23వ తేదీ నుండి జరిగిన జాతీయ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్షిప్ లో రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించిన జగ్గయ్యపేట చెరువు బజారు నకు చెందిన ఎం. తిరుపతమ్మ జూనియర్ బాలికలు విభాగంలో ఓవరాల్ పసిడి పథకాన్ని కైవసం చేసుకుంది. 63 కేజీల కేటగిరిలో తలపడి స్క్వాడ్ లో 202.5 కేజీలు, బెంచ్ ప్రెస్ లో 105 కేజీలు, డెడ్ లిఫ్టులో 185 కేజీలతో మొత్తం 492.5 కేజీల బరువు ఎత్తి ఓవరాల్ ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా జగ్గయ్యపేట పట్టణంలో ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య ని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తిరుపతమ్మ కు మెడల్స్, సర్టిఫికెట్ అందజేసి శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో మైనేని రాధాకృష్ణ, మల్లెల కొండయ్య, గాలం శ్రీను, గుమ్మ వెంకటేష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## నీటితొట్టెలో పడి ఇద్దరి మృతి

### -మృతులు రాజస్థాన్ వాసులు





**కళ్యాణదుర్గం, జూలై 9 (తెలుగురాష్ట్రం ప్రతినిధి):** జీవనోపాధి కోసం పట్టణానికి వచ్చిన రాజస్థాన్ కి చెందిన ఇద్దరు యువకులు నీటి సంపులో పడి మృత్యువాత పడ్డారు. మంగళవారం మధ్యాహ్నం కళ్యాణదుర్గం మండలం పాపంపల్లిలోని వెంకటేష్ బాబు వ్యవసాయ తోటలోని నీటి సంపులో పడిన ఇద్దరు యువకులను గుర్తించిన రైతులు పోలీసులకు సమాచారం అందించారు. రాజస్థాన్ కు చెందిన జుట్టూ (22), భగత్ సింగ్ (25) మరొక యువకుడు కలిసి పాపం పల్లి సమీపంలోని వ్యవసాయ తోటకు వెళ్లారు. అక్కడ బొప్పాయి మామిడి చెట్లలోని కాయలను కోసుకొని తిన్నారు. చెట్టు నుంచి కాయలను వేరు చేసే సమయంలో చేతికి అయిన జీడి, పాలను కడుక్కోవడానికి నీటి సంపు దగ్గరికి వెళ్లారు. సంపుకు చుట్టూ టార్పాలిన్ పరిచారు. ఈత రాని యువకులు ఒకరి తర్వాత ఒకరు నీటి సంపులో దిగే సమయంలో ప్లాస్టిక్ టార్పాలిన్ పై నడటంతో కాలు జారి ప్రమాదానికి గురయ్యారు. నీటి సంపులో పడిన జుట్టూను రక్షించేందుకు భగత్ సింగ్ సంపులోకి దిగాడు. ఇద్దరు ఊపిరాడక ఈత రాకపోవడంతో మృత్యువాత పడ్డారు. మరో యువకుడు కూడా ఇద్దరిని రక్షించ బోయినా ఫలితం లేకపోవడంతో డ్రిప్ పైపు సహాయంతో బయటపడినట్లు సమాచారం. ప్రాణాలతో బయటపడిన యువకుడు సమాచారం ఇవ్వడంతో తోట యజమాని కళ్యాణదుర్గం రూరల్ పోలీసులకు సమాచారం చేరవేశారు. సీఐ , ఎస్ఐ లతోపాటు పోలీసు సిబ్బంది సంఘటన స్థలానికి వెళ్లి మృతి చెందిన ఇద్దరు యువకులలో పోస్టుమార్టం నిమిత్తం కళ్యాణదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## సమన్వయంతో తెలుగుదేశం పార్టీ సంస్థాగత ఎన్నికలు -ఎమ్మెల్యే శిరీషదేవి



**రంపచోడవరం, జూలై 9(తెలుగు రాష్ట్రం విలేఖరి):** రంపచోడవరం నియోజకవర్గం శాసనసభ్యురాలు మిరియాల శిరీష దేవి అధ్యక్షతన నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ సంస్థాగత ఎన్నికలపై సమీక్ష సమావేశం జరిగింది. తొలుత తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారక రామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రంపచోడవరంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే శిరీష దేవి మాట్లాడుతూ త్వరలో ఏర్పాటు కాబోతున్న తెలుగుదేశం పార్టీ సంస్థాగత ఎన్నికల అందరి సమన్వయంతో జరుగుతాయని తెలిపారు. జూలై 15న అడ్డతీగల మండలం జూలై16న గంగవరం మండలం మండల పార్టీ అధ్యక్షుడు ఎన్నిక ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ముఖ్య నాయకులు మాట్లాడుతూ టిడిపి పార్టీ కోసం శ్రమించిన అందరికీ సముచిత స్థానం కల్పించేలా ఎమ్మెల్యే చొరవ తీసుకొని చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లాలని పలువురు కోరారు. ఈ సమావేశానికి రంపచోడవరం నియోజకవర్గ పరిశీలకులు కొల్లుబోయిన శ్రీనివాస్ యాదవ్, మాజీ శాసనసభ్యులు శీతంశెట్టి వెంకటేశ్వరరావు, చిన్నం బాబూ రమేష్, వంతల రాజేశ్వరి, జీసీసి డైరెక్టర్ గొర్లె సునీత, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు మఠం విజయభాస్కర్, ఏఎంసీ చైర్మన్ లోతా లక్ష్మణ రావు,కరకా వెంకటరమణ, శివాజీ,11 మండలాల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, ప్రజా ప్రతినిధులు, జమాల్ ఖాన్, సొసైటీ సభ్యులు, నియోజకవర్గ ఎన్నికల సంస్థాగత ఎన్నికల పరిశీలకులు కొత్త వెంకటేశ్వరరావు, ముడి నారాయణస్వామి,11 మండలాల ఎన్నికల పరిశీలకులు గొంది నాగేశ్వరరావు, సుభాష్ చంద్రబోస్ అప్పారావు, మహిళా నాయకులు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అక్షరాస్యత పెంచడమే లక్ష్యంగా అక్షరాంధ్ర.

### -ఈ ఏడాది ఆసక్తిగల వయోజనులైన 97,200 మంది నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చాలి.-జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి.



**ఏలూరు,జూలై 09, (తెలుగురాష్ట్రం విలేకరి):** వయోజనుల్లో అక్షరాస్యతను పెంచడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఉల్లాస్-అక్షరాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో అందరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి విజ్ఞప్తి చేశారు. బుధవారం స్థానిక కలెక్టర్ బంగ్లాలో వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో 2025-26 సంవత్సరానికి ఉల్లాస్ - అక్షరాంధ్ర జిల్లాస్థాయిఅధికారులతో కన్వర్జేన్స్ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో 100 గంటల శిక్షణతో ఈఏడాది 97,200 నిరక్షరాస్యులను అక్షరాశ్యులుగా తీర్చిదిద్దే ఉల్లాస్అక్షరాంధ్ర కార్యక్రమాన్ని సంబంధిత అధికారులు సమన్వయంతో జిల్లాను ప్రథమ స్థానంలో ఉంచాలన్నారు. గత ఏడాది నిర్వహించిన ఉల్లాస్ కార్యక్రమం అమల్లో ఏలూరు జిల్లా రాష్ట్రంలో ద్వితీయ స్థానంలో ఉందన్నారు. రాష్ట్రం వ్యాప్తంగా 2023 వ సంవత్సరంలో నిర్వహించిన క్యాస్ట్ సర్వే ద్వారా జిల్లాలో 15-59 సంవత్సరాలు మధ్య వయస్సు కలిగిన 3,16,441 మంది నిరక్షరాస్యులను గ్రామ , వార్డు సచివాలయాల శాఖల ద్వారా గుర్తించడం జరిగిందన్నారు. వారి నుండి ఏలూరు జిల్లాలో మొదటి విడతగా 2025-26 సంవత్సరం లో ఆసక్తిగల 97,200 మంది వయోజనులైన నిరక్షరాస్యులను ఎంపిక చేసి వారందరిని అక్షరాస్యులుగా చేయడానికి సంబంధిత శాఖల ద్వారా యాక్షన్ ప్లాన్ రూపొందించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించినట్లు తదుపరి మూడు సంవత్సరాల్లో మొత్తం 3,16,441 మంది నిరక్షరాస్యులైన వయోజనులను అక్షరాస్యులుగా చేసి ఏలూరు జిల్లాని అక్షరాస్యతలో మొదటి స్థానంలోకి తీసుకుని రావాలని సూచించారు.ప్రస్తుతం చేపట్టిన రెండో దఫా అక్షరాంధ్ర అక్షరాస్యత కార్యక్రమం ఈనెల 20వ తారీకు వరకు మండలాలలో వాలంటరీ టీచర్స్ ని గుర్తించి, వారికి మ్యాచింగ్ బ్యాచింగ్ ద్వారా పదిమందికి ఒక వాలంటరీ టీచర్ ని ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం ఈనెల 21వ తారీకు నుండి 25వ తారీకు వరకు ఒకరోజు జిల్లాస్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించాలన్నారు. ఈనెల 26వ నుండి ఆగస్టు 6వ తేదీ వరకు మండల స్థాయిలో వాలంటరీ టీచర్స్ కి, రిసోర్స్ పర్సన్స్ కి శిక్షణ కార్యక్రమాలు ఎంపీడీవో ఆధ్వర్యంలో నిర్వహించాలన్నారు. ఆగస్టు 7వ తేదీ నుండి వచ్చే ఫిబ్రవరి వరకు 100 గంటల తరగతులు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ శిక్షణ తరగతులలో వయోజనులైన నిరక్షరాస్యులకు ఫైనాన్షియల్ లిటరసీ, డిజిటల్ లిటరసీ, ఫంక్షనల్ లిటరసీ లలో శిక్షణ అందించాలన్నారు. అనంతరం మార్చి నెలలో వారికి పరీక్ష నిర్వహించాలన్నారు. ఏలూరు జిల్లా వయోజన విద్య నోడల్ అధికారి కెవివి సత్యనారాయణ మాట్లాడుతూ గత సంవత్సరం 2024 -25 సంవత్సరంలో ఉల్లాస్ అక్షరాస్యత కార్యక్రమం ద్వారా 27 మండలాల్లో నిరక్షరాస్యులైన డ్వాక్రా గ్రూపు మహిళలను 7,321 మందిని గుర్తించి 7,286 మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దడం జరిగిందన్నారు. సమావేశంలో జిల్లా వయోజన విద్య నోడల్ అధికారి కె వి వి సత్యనారాయణ, జెడ్పి సిఇఓ శ్రీహరి, డిఆర్డిఏ పిడి ఆర్. విజయరాజు, డిఇఓ ఎం. వెంకటలక్ష్మమ్మ, ఐసిడిజిఎస్ ఈఈ మల్లిక, వయోజన విద్య అసిస్టెంట్ ప్రొజెక్టర్ అధికారి విజయకుమార్, జిల్లా పంచాయితీ,మెప్మా అధికారులు పాల్గొన్నారు..



# ఏలూరు కదం తొక్కిన కార్మిక లోకం

### -దేశవ్యాప్త సమ్మె మద్దతు తెలిపిన జిల్లా ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు

**ఏలూరు,జూలై 09, (తెలుగురాష్ట్రం విలేకరి):** కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్ లను రద్దు చేయాలని కోరుతూ పలు కార్మిక సంఘాలు చేపట్టిన దేశవ్యాప్త సమ్మె సందర్భంగా బుధవారం ఉదయం నగరంలో చేపట్టిన మహాధర్నాకు జిల్లా ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు మద్దతు తెలిపి, నిరసన వ్యక్తం చేయడం జరిగింది. స్థానిక పవర్ పేట రైల్వే స్టేషన్ నుండి ప్రారంభమైన ప్రదర్శన రమా మహల్ సెంటర్ మీదుగా ఆర్ఆర్ పేట పార్క్ వద్దకు చేరుకుంది. ఈ సందర్భంగా కార్మిక వ్యతిరేక లేబర్




కోడ్లను రద్దు చేయాలని, కార్మికులందరికీ కనీస వేతనం 26000 అమలు చేయాలని, పని గంటల పెంపును రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను ఆపాలని, ధరలను అరికట్టాలని, నిరుద్యోగ సమస్య పరిష్కరించాలని పెద్ద పెట్టున నినాదాలు చేశారు. అన్ని సంఘాలతో పాటుగా మీడియా కూడా పాల్గొనడం జరిగినది. ఈకార్యక్రమంలో పలు కార్మిక కార్మిక సంఘాల నేతలు మద్దతు తెలియజేశారు. ఈకార్యక్రమంలో రాష్ట్రకార్యదర్శి కె. శంకర్రావు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సయ్యద్ జబీర్, వైవి. హరీష్,జిల్లా ఉపాధ్యక్షులు టి. వెంకట్రావు, డి. సత్యనారాయణ, ప్రజాశక్తి గంగరాజు, జయరాంసిహెచ్. ప్రతాప్, పి. మిల్టన్ పాల్గొన్నారు.

## రక్తదానం మహాదానమని, రక్తదానంపై అపోహలు వద్దు .. రోటరీ క్లబ్




**భీమవరం జూలై 9, (తెలుగురాష్ట్రం విలేకరి):** రక్తదానం మహాదానమని, రక్తదానంపై అపోహలు వద్దని, ఆపదలో ఉన్న వారి ప్రాణాలను రక్షించడానికి సేకరించిన రక్తం ఎంతో ఉపయోగపడుతుందని రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు గుండు కిషోర్, మండ విజయ్ భాస్కర్, కోశాధికారి బోండా సుబ్బారావు అన్నారు. భీమవరం మండలం రాయలం లోని ఇండియన్ రెడ్ క్రాస్ భవనంలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం బ్లడ్ డొనేషన్ క్యాంప్ నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉండే ప్రతి మనిషి ప్రతీ 5 నెలలకొకసారి రక్తదానం చేయడం ద్వారా శరీరం మరింత ఉత్సాహవంతంగా మారుతుందన్నారు.యువత రక్తదానం వంటి సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనాలన్నారు. అనంతరం రక్తదానం చేసిన దాతలకు సర్టిఫికెట్స్ ను అందించారు. అక్షింతల సత్య సురేష్, అక్షింతల మంగేష్ తదితరులు పాల్గొన్నారు

## 29వ వార్డులో బాల బాలికలకు స్కూల్ బ్యాగ్స్ పంపిణీ

### - మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ వైఎస్సార్ కు భారతరత్న ఇవ్వాలని వినతి



**భీమవరం జూలై 9, (తెలుగురాష్ట్రం విలేకరి):** సంక్షేమ పథకాల చాంపియన్ దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి అని, ఆయనకు భారతరత్న బిరుదును ప్రధానం చేయాలని దళిత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందర్ కుమార్ కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి 76వ జయంతిని పురస్కరించుకుని భీమవరం 29వ వార్డు ప్రకాష్ నగర్ లో బహుజన యూత్ ఫ్రంట్ కన్వీనర్ గంటా రాహుల్ రిచర్డ్ సౌజన్యంతో 50 మంది బాల బాలికలకు స్కూల్ బ్యాగ్స్ ను పంపిణీ చేశారు. గంటా సుందర్ కుమార్ మాట్లాడుతూ దివంగత నేత వైఎస్సార్ ప్రజల గుండెలలో ఎప్పటికీ చిరస్థాయిగా నిలిచిపోతారని, రాష్ట్రానికి ఆయన అందించిన సేవలు ఎనలేనివని అన్నారు. కార్యక్రమంలో గంటా అనితా రాణి, పట్టేం శుభకర్, అంబటి ఆనంద్ కుమార్, గొల్ల రాజ్ కుమార్, గెడ్డం జార్జ్ తదితరులు పాల్గొన్నారు.

## డ్రైనేజీ సిసి రోడ్డు పనులకు ఎమ్మెల్యే చిర్రి భూమి పూజ



**జీలుగుమిల్లి, జూలై9,(తెలుగు రాష్ట్రం విలేఖరి):** మండలంలోని కామయ్యపాలెం గ్రామంలో మండల పరిషత్ నిధులతో రూ. 4.50 లక్షల వ్యయంతో నూతన సిసి రోడ్డు రూ. 3.90లక్షలతో ఊర చెరువు కళింగ (సర్ ప్లస్ వ్యూయర్ ) నిర్మాణ పనులకు ఎమ్మెల్యే చిర్రి బాలరాజు జనసేన జిల్లా కార్యదర్శి గడ్డమణుగు రవికుమార్ తో కలసి భూమి పూజలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందని అన్నారు. కూటమి ప్రభుత్వంలో పేద బడుగు బలహీన వర్గాల ప్రజలు సుఖ సంతోషాలతో ఉన్నారని అన్నారు. అనంతరం స్థానిక మహిళలు డ్రైనేజీ నిర్మాణాలు గ్రామంలో మరిన్ని ఎమ్మెల్యే బాలరాజును కోరారు. త్వరలో కూడా డ్రైనేజీ నిర్మాణాలతో పాటు సిసి రహదారులు, స్వంతింటి కలను సహకారం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పసుపులేటి రాము, నాలి శ్రీను, బండారు అనిల్, గుడేల్లి లక్ష్మీనారాయణ, స్థానిక సర్పంచ్ భోగేశ్వరరావు, ఇన్చార్జి ఎంపిడిఓ నిఖిల్ చరణ్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగురాష్ట్రం దినపత్రిక
SPORTS NEWS
https://epaper.teluguraastram.com
అమలాపురం జులై 10, గురువారం 2025


# లార్డ్స్ టెస్ట్ నుంచి తెలుగబ్బాయ్ ఔట్..

## ప్రియ శిష్యుడికి చోటివ్వనున్న గంభీర్.. కారణం ఏంటంటే?



**శుభ్‌మన్ గిల్ కెప్టెన్సీలో తొలి మ్యాచ్‌లో ఓడిపోయిన తర్వాత, టీమ్ ఇండియా ఎడ్జ్‌బాస్టన్‌లో బలమైన పునరాగమనం చేసింది. ఎడ్జ్‌బాస్టన్‌లో జరిగిన మ్యాచ్‌లో, భారత్ ఆతిథ్య జట్టును 336 పరుగుల తేడాతో ఓడించింది. ఈ మ్యాచ్‌లో భారత్ విజయం సాధించిన తర్వాత, సిరీస్ 1-1తో సమంగా ఉంది. ఇప్పుడు సిరీస్‌లోని మూడవ మ్యాచ్ జూలై 10 నుంచి లార్డ్స్‌లో జరుగుతుంది.**

ఈ మ్యాచ్ గెలవడం ద్వారా భారత జట్టు ఇంగ్లాండ్ పై ఒత్తిడి తీసుకురావాలనుకుంటోంది. ఇలాంటి పరిస్థితిలో, ఆడే 11 మంది భారత్ ఏ జట్టును ఫీల్డింగ్ చేస్తుందో అందరూ ఆసక్తిగా గమనిస్తున్నారు. ఈ సమయంలో, నితీష్ కుమార్ రెడ్డిని ప్లేయింగ్ 11 నుంచి పక్కన పెట్టవచ్చని వార్తలు వినిపిస్తున్నాయి. కోచ్ గౌతమ్ గంభీర్ తన అభిమాన శిష్యుడిని నితీష్ స్థానంలో ఫైనల్ ఎలెవన్ జట్టులోకి తీసుకురావచ్చు. ఇప్పుడు ఈ ఆటగాడు ఎవరో తెలుసుకుందాం..?

లార్డ్స్ క్రికెట్ మైదానంలో జరగనున్న ఇండియా vs ఇంగ్లాండ్ మూడో మ్యాచ్ కోసం టీం ఇండియా ప్లేయింగ్ 11 గురించి మాట్లాడుకుంటే, ప్రస్తుతానికి బ్యాటింగ్‌లో ఎటువంటి మార్పు లేదు. యశస్వి జైస్వాల్ నుంచి కేఎల్ రాహుల్, శుభ్‌మాన్ గిల్, రిషబ్ పంత్ వరకు అందరూ బ్యాటింగ్ ఆర్డర్‌లో ఉన్నారు.

అయితే, కోచ్ గౌతమ్ గంభీర్‌కు కరుణ్ నాయర్ విషయంలో సందిగ్ధత ఉండవచ్చు. మొదటి రెండు మ్యాచ్‌లలో నాలుగు ఇన్నింగ్స్ లలో అతను విఫలమయ్యాడు. అయితే, మూడో టెస్ట్‌లోనూ కరుణ్‌పై కరుణ చూపించే అవకాశం ఉంది.

### నితీష్ కుమార్ రెడ్డి ఔట్.. శార్దూల్ ఠాకూర్ ఇన్..

మార్పుల గురించి మాట్లాడుకుంటే, గౌతమ్ గంభీర్ మూడవ మ్యాచ్‌లో నితీష్ కుమార్ రెడ్డిని పక్కన పెట్టవచ్చు. ఎందుకంటే రెండవ మ్యాచ్‌లో అతని ప్రదర్శన అంత బాగా లేదు. ఆ మ్యాచ్‌లో, రెండు ఇన్నింగ్స్‌లలో అతని బ్యాట్ నుంచి కేవలం 2 పరుగులు మాత్రమే వచ్చాయి.

ఇది కాకుండా, అతను మొదటి ఇన్నింగ్స్‌లో 6 ఓవర్లు బౌలింగ్ చేశాడు. కానీ, అతనికి ఎటువంటి వికెట్ లభించలేదు. మూడవ మ్యాచ్‌లో అతన్ని తొలగించడానికి ఇదే కారణం. ప్రధాన కోచ్ అతని స్థానంలో శార్దూల్ ఠాకూర్‌ను తీసుకోవచ్చు. అతను మొదటి మ్యాచ్ ఆడాడు. ఈ సమయంలో, అతను 2 వికెట్లు తీసుకున్నాడు.

### ప్రసిద్ధ్ కృష్ణ స్థానంలో జస్ప్రీత్ బుమ్రా రీఎంట్రీ..

నితీష్ కుమార్ రెడ్డి కాకుండా , గౌతమ్ గంభీర్ మూడవ మ్యాచ్ నుంచి ప్రసిద్ధ్ కృష్ణను మినహాయించవచ్చు. ఎందుకంటే ప్రసిద్ధ్ చాలా ఖరీదైన బౌలర్ అని నిరూపించుకున్నాడు. జస్ప్రీత్ బుమ్రా ఈ మ్యాచ్‌లో తిరిగి రాబోతున్నాడు. కాబట్టి కృష్ణను తొలగించవచ్చు. మొదటి మ్యాచ్ ఆడిన తర్వాత, బుమ్రాకు రెండవ మ్యాచ్‌లో విశ్రాంతి ఇచ్చిన విషయం తెలిసిందే. కానీ, అతను మూడవ మ్యాచ్‌లో తిరిగి వస్తాడు.

IND vs ENG ఇంగ్లాండ్ తో జరిగే మూడో మ్యాచ్ కు భారత జట్టు ప్రాబబుల్ ప్లేయింగ్-11: యశస్వి జైస్వాల్, కెఎల్ రాహుల్, కరుణ్ నాయర్, శుభ్‌మాన్ గిల్ (కెప్టెన్), రిషబ్ పంత్ (వికెట్ కీపర్), రవీంద్ర జడేజా, రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్, శార్దూల్ ఠాకూర్, జస్ప్రీత్ బుమ్రా, మొహమ్మద్ సిరాజ్, ఆకాశ్ దీప్.

# లారా, రోహిత్ రికార్డులపై కన్నేసిన రిషబ్ పంత్

**భారత క్రికెట్ జట్టు యువ సంచలనం, వికెట్ కీపర్-బ్యాట్స్‌మెన్ రిషబ్ పంత్ టెస్ట్ క్రికెట్‌లో తన దూకుడు బ్యాటింగ్‌తో సరికొత్త చరిత్ర సృష్టిస్తున్నాడు. ముఖ్యంగా సిక్సర్లు కొట్టడంలో అతను చూపుతున్న ఆధిపత్యం మాజీ దిగ్గజాల రికార్డులను సైతం అతీతం చేసే దిశగా సాగుతోంది. వెస్టిండీస్ దిగ్గజం బ్రయాన్ లారా, భారత కెప్టెన్ రోహిత్ శర్మ పేరిట ఉన్న అరుదైన టెస్ట్ సిక్సర్ల రికార్డులను పంత్ త్వరలోనే అధిగమించే అవకాశం ఉంది.**




### విదేశాల్లో అత్యధిక సిక్సర్ల రికార్డు పంత్ సొంతం..!

ఇటీవలే ఇంగ్లాండ్‌తో జరిగిన రెండో టెస్టులో రిషబ్ పంత్ అద్భుతమైన బ్యాటింగ్‌తో ఇంగ్లాండ్ గడ్డపై అత్యధిక టెస్ట్ సిక్సర్లు కొట్టిన బ్యాట్స్‌మెన్‌గా చరిత్ర సృష్టించాడు. బెన్ స్టోక్స్ (సౌత్ ఆఫ్రికాలో 21 సిక్సర్లు) పేరిట ఉన్న రికార్డును అధిగమించి, ఇంగ్లాండ్‌లో 24 సిక్సర్లతో పంత్ అగ్రస్థానంలో నిలిచాడు. ఇది అతను ఎంత దూకుడుగా ఆడుతున్నాడో, విదేశీ పిచ్‌లపై కూడా అలవోకగా బంతిని బౌండరీ అవతలికి పంపగల సామర్థ్యాన్ని సూచిస్తుంది.

### లారా, రోహిత్ శర్మ రికార్డులు పంత్‌కు చేరువలో..

టెస్ట్ క్రికెట్ ఓవరాల్ సిక్సర్ల జాబితాను పరిశీలిస్తే, ఇంగ్లాండ్ ఆల్ రౌండర్ బెన్ స్టోక్స్ 133 సిక్సర్లతో అగ్రస్థానంలో ఉన్నాడు. ఆ తర్వాత బ్రెండన్ మెక్‌కలమ్ (107), ఆడమ్ గిల్ క్రిస్ట్ (100) ఉన్నారు. ఈ జాబితాలో ప్రస్తుతం బ్రయాన్ లారా 88 సిక్సర్లతో కొనసాగుతున్నాడు. భారత కెప్టెన్ రోహిత్ శర్మ కూడా 88 సిక్సర్లతో లారాతో (అక్టోబర్ 2024 నాటికి ఉన్న డేటా ప్రకారం) కలిసి ఉన్నాడు.

### "నన్ను అలా చేయమని షమీ బలవంతం చేశాడు.."

రిషబ్ పంత్ ఇప్పటివరకు తన కెరీర్‌లో వేగంగా సిక్సర్లు కొడుతూ టెస్ట్ క్రికెట్‌లో తనదైన ముద్ర వేస్తున్నాడు. అతను ఇప్పటికే తన దూకుడు బ్యాటింగ్‌తో పలు రికార్డులను తన ఖాతాలో వేసుకున్నాడు. టెస్ట్ మ్యాచ్‌లలో రెండు ఇన్నింగ్స్‌లలో సెంచరీలు చేసిన రెండవ వికెట్ కీపర్‌గా (ఆండీ ఫ్లవర్ తర్వాత), ఇంగ్లాండ్ గడ్డపై ఒకే మ్యాచ్‌లో అత్యధిక పరుగులు చేసిన వికెట్ కీపర్‌గా (253 పరుగులు) కూడా రికార్డు సృష్టించాడు.

లారా, రోహిత్ శర్మల రికార్డులను బద్దలు కొట్టడానికి పంత్‌కు మరికొన్ని సిక్సర్లు అవసరం. ప్రస్తుతం పంత్ తన కెరీర్ పీక్‌లో ఉన్నాడు. అతని సహజసిద్ధమైన దూకుడు, నిర్భయమైన బ్యాటింగ్ శైలిని బట్టి చూస్తే, ఈ రెండు రికార్డులను అతను త్వరలోనే అధిగమించడం ఖాయం. పంత్ లాంటి యువ బ్యాట్స్‌మెన్ టెస్ట్ క్రికెట్‌లో సిక్సర్ల వర్షం కురిపించడం ఈ ఫార్మాట్‌కు కొత్త ఉత్సాహాన్ని ఇస్తుంది, అభిమానులను అలరిస్తుంది. అతని తదుపరి మ్యాచ్‌లలో ఈ రికార్డులను పంత్ ఎప్పుడు అధిగమిస్తాడో చూడటానికి క్రికెట్ ప్రపంచం ఆసక్తిగా ఎదురుచూస్తోంది.

### ఎవరు ఎక్కువ సిక్సర్లు కొట్టారంటే?

అత్యధిక సిక్సర్లు కొట్టిన భారత బ్యాట్స్‌మన్ వీరేంద్ర సెహ్వాగ్. తన 12 ఏళ్ల టెస్ట్ కెరీర్‌లో 91 సిక్సర్లు కొట్టిన ఘనతను అతను సాధించాడు. రెండవ పేరు రోహిత్ శర్మ, అతను 67 టెస్టుల్లో 88 సిక్సర్లు కొట్టాడు. అదే సమయంలో, ప్రపంచంలో టెస్టుల్లో అత్యధిక సిక్సర్లు కొట్టిన బ్యాట్స్‌మన్ బెన్ స్టోక్స్, అతను 113 టెస్టుల్లో 133 సిక్సర్లు కొట్టాడు. జులై 10 నుంచి లార్డ్స్‌లో జరగనున్న టెస్ట్ మ్యాచ్‌లో రిషబ్ పంత్ రోహిత్, లారాను ఓడించగలడా అనేది ఇప్పుడు ఆసక్తికరంగా ఉంటుంది. అతను అలా చేస్తే, చాలా తక్కువ టెస్టుల్లో ఈ ఘనత సాధించిన మొదటి భారతీయుడు అవుతాడు.

# స్పైసీ ట్రాక్‌తో భయపెడుతోన్న లార్డ్స్ పిచ్..

## బ్యాటర్లంతా 108కి కాల్ చేయాల్సిందేగా..?





**భారత్, ఇంగ్లాండ్ మధ్య జరుగుతున్న ఐదు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్‌లో ఉత్కంఠ పతాక స్థాయికి చేరుకుంది. ఎడ్జ్‌బాస్టన్‌లో జరిగిన రెండో టెస్టులో భారత్ భారీ విజయం సాధించి సిరీస్‌ను 1-1తో సమం చేయడంతో, ఇప్పుడు జులై 10 నుంచి లార్డ్స్‌లో ప్రారంభమయ్యే మూడో టెస్టుపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ కీలక మ్యాచ్‌కు ముందు లార్డ్స్ పిచ్‌పై తొలి చూపు అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది %-% ఇది బ్యాట్స్‌మెన్‌లకు నరకం చూపించడం ఖాయమని తెలుస్తోంది..!**

### పచ్చని పిచ్, పేసర్లకు పండుగే..!

లార్డ్స్ పిచ్‌పై ప్రస్తుతం పచ్చని గడ్డి దట్టంగా కనబడుతోంది. పిచ్ కండిషన్స్ చూస్తుంటే, మొదటి రెండు టెస్టుల కంటే ఇది చాలా భిన్నంగా ఉండబోతోందని స్పష్టమవుతోంది. లీడ్స్, ఎడ్జ్‌బాస్టన్ పిచ్‌లు బ్యాటింగ్‌కు అనుకూలించగా, లార్డ్స్ పిచ్ మాత్రం పేస్ బౌలర్లకు స్వర్గధామంగా మారే అవకాశం ఉంది. భారత బ్యాటింగ్ కోచ్ సితాంషు కోటక్ మాట్లాడుతూ, "పిచ్ చాలా పచ్చగా ఉంది. రేపు గడ్డి కత్తిరించిన తర్వాత ఒక అంచనా వస్తుంది. బౌలర్లకు సహాయం లభిస్తుందని ఆశించవచ్చు. బ్యాటర్లకు మానసికంగా సిద్ధంగా ఉండటం కీలకం" అని తెలిపారు. హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ కూడా పిచ్‌ను క్షుణ్ణంగా పరిశీలిస్తున్న ఫోటోలు వైరల్ అవుతున్నాయి. ఇది పేసర్లకు అనుకూలించే వ్యూహాన్ని భారత్ అనుసరించే అవకాశం ఉందని సూచిస్తుంది.

### ఇంగ్లాండ్ వ్యూహం: స్పైసీ పిచ్..!

ఎడ్జ్‌బాస్టన్‌లో ఘోర పరాజయం తర్వాత, ఇంగ్లాండ్ తమ వ్యూహాన్ని మార్చుకుంది. కెప్టెన్ బెన్ స్టోక్స్, కోచ్ బ్రెండన్ మెక్‌కలమ్ ఇద్దరూ లార్డ్స్‌లో "మరింత పేస్, బౌన్స్" పిచ్ కావాలని కోరినట్లు సమాచారం. జోఫ్రా ఆర్చర్, గస్ అట్కిన్సన్ వంటి పేసర్‌లను జట్టులోకి తీసుకోవడంతో, ఇంగ్లాండ్ భారత్‌ను తమ పేస్ దాడితో దెబ్బతీయాలని చూస్తోంది. గత నెలలో లార్డ్స్‌లో జరిగిన ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్‌లో పేసర్లు అద్భుతంగా రాణించిన నేపథ్యంలో, అదే తరహా పిచ్‌ను ఇంగ్లాండ్ ఆశిస్తోంది.

లార్డ్స్‌లోని ఎనిమిది అడుగుల వాలు, పచ్చని గడ్డి భారత బ్యాట్స్‌మెన్‌లకు నిజమైన సవాలును విసిరే అవకాశం ఉంది. అయితే, రెండో టెస్టులో విశ్రాంతి తీసుకున్న జస్ప్రీత్ బుమ్రా మూడో టెస్టుకు తిరిగి రావడం భారత్‌కు పెద్ద బలం. బుమ్రా, ఆకాష్ దీప్, మహ్మద్ సిరాజ్ వంటి నాణ్యమైన పేసర్లు భారత్‌కు ఉండటంతో, పిచ్ పేసర్‌లకు అనుకూలించినా టీమిండియా బౌలింగ్ దళం కూడా ధీటుగా బదులిచ్చే అవకాశం ఉంది. లార్డ్స్‌లో భారత్ రికార్డు అంత బాగాలేదు, 19 టెస్టుల్లో కేవలం 3 మాత్రమే గెలిచింది. కానీ ఇటీవల వారి ప్రదర్శన మెరుగైంది. ఈసారి పచ్చని పిచ్‌పై భారత బ్యాట్స్‌మెన్‌లు ఎలా రాణిస్తారు, బుమ్రా సారథ్యంలోని భారత పేస్ దళం ఎలా చెలరేగుతుంది అనేది చూడాలి. ఈ టెస్టు సిరీస్ గమనాన్ని నిర్ణయించే అవకాశం ఉంది!

# టెక్సాస్‌తో క్వాలిఫయర్ మ్యాచ్ రద్దు..


## మేజర్ లీగ్ ఫైనల్‌కు వాషింగ్టన్

మేజర్ లీగ్ క్రికెట్ టోర్నీ కీలక సమయంలో వరుణుడు ప్రభావం చూపించాడు. వాషింగ్టన్ ఫ్రీడమ్ - టెక్సాస్ సూపర్ కింగ్స్ జట్ల మధ్య మ్యాచ్ వర్షం కారణంగా రద్దైంది. దీంతో పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో ఉన్న గ్లెన్ మ్యాక్స్‌వెల్ నాయకత్వంలోని వాషింగ్టన్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. అయితే, డుప్లెసిస్ కెప్టెన్‌గా ఉన్న టెక్సాస్‌కు మరో ఛాన్స్ ఉంది. శాన్ ఫ్రాన్సిస్కో - ఎంఐ న్యూయార్క్ మధ్య గురువారం వేకువ జామున ఎలిమినేటర్ మ్యాచ్ జరగనుంది. ఇందులో నెగ్గిన జట్టుతో టెక్సాస్ సూపర్ కింగ్స్ జులై 12న జరగబోయే ఛాలెంజర్ మ్యాచ్‌లో తలపడనుంది. ఆ తర్వాత జులై 14న ఫైనల్ జరగనుంది.



# 'క్రికెట్ మక్కా లార్డ్స్'తో తండ్రి అద్భుతం.. కట్‌చేస్తే.. 5 మ్యాచ్‌ల్లో 18 పరుగులతో కొడుకు చెత్త కెరీర్..

**క్రికెట్ ప్రపంచంలో 'క్రికెట్ స్వర్గధామం'గా ప్రసిద్ధి చెందిన లార్డ్స్ క్రికెట్ గ్రౌండ్ గురించి తెలియని క్రికెట్ అభిమాని ఉండరు. ఈ చారిత్రాత్మక మైదానం వెనుక ఒక ఆసక్తికరమైన చరిత్ర, ఒక మహానుభావుడి దూరదృష్టి ఉంది. ఆయనే థామస్ లార్డ్. కేవలం ఒక క్రికెట్ మైదానాన్ని స్థాపించడమే కాకుండా, క్రికెట్ నియమావళిని రూపొందించడంలో, ఈ క్రీడను ప్రపంచవ్యాప్తంగా వ్యాప్తి చేయడంలో థామస్ లార్డ్ కీలక పాత్ర పోషించాడు. అయితే, అతని కుమారుడు కూడా క్రికెటర్ కావడం, అతని కెరీర్‌లో కేవలం 18 పరుగులు మాత్రమే చేయగలిగాడు అనేది చాలామందికి తెలియని ఆసక్తికరమైన విషయం.**




థామస్ లార్డ్ 1755లో యార్క్‌షైర్‌లో జన్మించాడు. ఒక క్రికెటర్‌గా, అలాగే తెలివైన వ్యాపారవేత్తగా అతనికి పేరుంది. లండన్‌కు వచ్చిన తర్వాత, వైట్ కండ్యూట్ క్లబ్‌లో ప్రాక్టీస్ బౌలర్‌గా, గ్రౌండ్స్‌మన్‌గా పనిచేశాడు. 1787లో, థామస్ లార్డ్ తన మొదటి క్రికెట్ గ్రౌండ్‌ను లండన్‌లోని డోర్సెట్ ఫీల్డ్స్‌లో (ప్రస్తుతం డోర్సెట్ స్క్వేర్) ఏర్పాటు చేశాడు. ఇది "లార్డ్స్ ఓల్డ్ గ్రౌండ్"గా ప్రసిద్ధి చెందింది. ఈ గ్రౌండ్‌ను స్థాపించడంలో, మెరిలేబోన్ క్రికెట్ క్లబ్ ఏర్పాటు చేయడంలో థామస్ లార్డ్ కీలక పాత్ర పోషించాడు.

కాలక్రమేణా, లీజు సమస్యలు, రెంట్ల పెరుగుదల కారణంగా థామస్ లార్డ్ తన గ్రౌండ్‌ను రెండుసార్లు మార్చాడు. చివరికి 1814లో సెయింట్ జాన్స్ వుడ్‌లోని ప్రస్తుత లార్డ్స్ మైదానాన్ని స్థాపించాడు. "హోమ్ ఆఫ్ క్రికెట్"గా పిలవబడే ఈ మైదానం, అతని పేరు మీదనే స్థిరపడిపోయింది. క్రికెట్ చరిత్రలో ఎన్నో అద్భుత ఘట్టాలకు, మైలురాళ్లకు ఈ మైదానం సాక్ష్యంగా నిలిచింది. MCC ఇప్పటికీ క్రికెట్ నియమాలకు సంరక్షకుడిగా, మధ్యవర్తిగా వ్యవహరిస్తోంది. ఈ కొత్త మైదానం జూన్ 22, 1814న మెరిల్‌బోన్ క్రికెట్ క్లబ్ తన మొదటి మ్యాచ్‌ను హెర్ట్‌ఫోర్డ్‌షైర్‌తో ప్రారంభమైంది. ఈ మైదానంలో మొదటి అంతర్జాతీయ మ్యాచ్ 1884 జులై 21న ఇంగ్లాండ్ వర్సెస్ ఆస్ట్రేలియా మధ్య జరిగింది. లార్డ్స్ క్రికెట్ మైదానం నేడు 31,100 మంది ప్రేక్షకుల సామర్థ్యం కలిగిన ఆధునిక స్టేడియం, దీనిలో ఆడటం ప్రతి ఆటగాడి కల. ఇంగ్లాండ్‌తో జరుగుతున్న టెస్ట్ సిరీస్‌లో టీమ్ ఇండియా మూడవ మ్యాచ్‌ను ఈ మైదానంలో ఆడాలి. టీమిండియాకు చెందిన చాలా మంది ఆటగాళ్లు మొదటిసారి ఈ స్టేడియంలో ఆడనున్నారు.

థామస్ లార్డ్‌కు ఒక కుమారుడు ఉన్నాడు. అతని పేరు కూడా థామస్ లార్డ్ జూనియర్. అతను కూడా క్రికెటర్. 1794లో జన్మించిన థామస్ లార్డ్ జూనియర్, 1815 నుంచి 1816 వరకు ఫస్ట్-క్లాస్ క్రికెట్ ఆడాడు. అతను ప్రధానంగా మిడిల్‌సెక్స్ జట్టుతో సంబంధం కలిగి ఉన్నాడు. అయితే, అతని క్రికెట్ కెరీర్ అంత గొప్పగా సాగలేదు. అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం, థామస్ లార్డ్ జూనియర్ తన ఫస్ట్-క్లాస్ కెరీర్‌లో మొత్తం 5 మ్యాచ్‌లు ఆడాడు. ఈ 5 మ్యాచ్‌లలో అతను కేవలం 18 పరుగులు మాత్రమే చేయగలిగాడు. అతని బ్యాటింగ్ సగటు 2.25గా ఉంది. బ్యాటింగ్‌లో పెద్దగా రాణించలేకపోయినా, అతను ఒక వికెట్ కూడా పడగొట్టాడు.

లార్డ్స్ క్రికెట్ గ్రౌండ్ వంటి మహత్తర క్రీడా వేదికను నిర్మించిన తండ్రికి, అతని కుమారుడు కేవలం 18 పరుగులు మాత్రమే చేయగలిగాడు అనేది విచిత్రమైన, ఆసక్తికరమైన విషయం. ఇది క్రికెట్‌లో ప్రతిభ, అదృష్టం, అలాగే కొన్నిసార్లు అంచనాలకు మించిన ఫలితాలు ఎలా ఉంటాయో తెలియజేస్తుంది. తండ్రి క్రికెట్ ప్రపంచంలో ఒక దిగ్గజంగా నిలిస్తే, కుమారుడు మాత్రం కేవలం కొన్ని గణాంకాలతోనే సరిపెట్టుకోవలసి వచ్చింది. అయినా సరే, థామస్ లార్డ్ జూనియర్, 'లార్డ్స్' పేరుతో అనుబంధం ఉన్న వ్యక్తిగా చరిత్రలో నిలిచిపోయాడు.

# నెపోటిజంపై మంచు మనోజ్ ఆసక్తికర వ్యాఖ్యలు



## సినీ వారసత్వంపై మంచు మనోజ్ కీలక వ్యాఖ్యలు

చిత్ర పరిశ్రమలో వారసత్వం, నెపోటిజంపై ఎప్పటి నుంచో కొనసాగుతున్న చర్చపై నటుడు మంచు మనోజ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సినీ నేపథ్యం ఉన్నంత మాత్రాన విజయాలు వాటంతట అవే రావని, పరిశ్రమలో నిలదొక్కుకోవాలంటే ప్రతి ఒక్కరూ కష్టపడాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. యంగ్ హీరో సుహాస్ నటించిన 'ఓ భామ అయ్యో రామ' చిత్ర ప్రీ-రిలీజ్ వేడుకకు హాజరైన మనోజ్ ఈ వ్యాఖ్యలు చేశారు.

### నెపోటిజం ఒక అపవాదు మాత్రమే: మంచు మనోజ్

ఈ సందర్భంగా మంచు మనోజ్ మాట్లాడుతూ, "పరిశ్రమలో వారసత్వ నటులకే అవకాశాలు దక్కుతాయనేది ఒక అపవాదు మాత్రమే" అని అన్నారు. "సినిమా నేపథ్యం అనేది కేవలం పరిశ్రమలోకి రావడానికి మాత్రమే ఉపయోగపడుతుంది. కానీ, ఇక్కడ నిలబడాలంటే ప్రతిభను నిరూపించుకోవాలి, ప్రేక్షకుల ఆదరణ పొందాలి. అప్పుడే ఎవరైనా రాణించగలరు" అని ఆయన తన అభిప్రాయాన్ని కుండబద్దలు కొట్టారు. పెద్ద బడ్జెట్ చిత్రాలు, మల్టీస్టారర్ సినిమాలు విజయాన్ని నిర్ణయించలేవని కూడా ఆయన అభిప్రాయపడ్డారు. కేవలం అవే విజయానికి కొలమానం కాదని పరోక్షంగా పేర్కొన్నారు.

### సుహాస్ ప్రయాణం స్ఫూర్తిదాయకం: మనోజ్ ప్రశంసలు

నటుడు సుహాస్ ప్రయాణాన్ని మనోజ్ ఈ సందర్భంగా ప్రత్యేకంగా ప్రశంసించారు. "యూట్యూబ్ నుంచి కెరీర్ మొదలుపెట్టి, కమెడియన్‌గా గుర్తింపు తెచ్చుకుని, ఇప్పుడు హీరో స్థాయికి ఎదగడం సుహాస్ కష్టానికి నిదర్శనం" అని మనోజ్ కొనియాడారు. "అతని ప్రయాణం నేటి యువతకు ఎంతో స్ఫూర్తిదాయకం. తమిళ నటుడు విజయ్ సేతుపతిలా ఒకవైపు హీరోగా, మరోవైపు క్యారెక్టర్ ఆర్టిస్టుగా రాణించడం అభినందనీయం" అని సుహాస్‌ను ఆకాశానికెత్తారు.కాగా, సుహాస్, మాళవిక మనోజ్ జంటగా నటించిన 'ఓ భామ అయ్యో రామ' చిత్రం రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కింది. ఈ సినిమా జులై 11న థియేటర్లలో విడుదల కానుంది.

# మళ్లీ విలన్‌గా మారుతున్న యంగ్ హీరో!



విభిన్నమైన కథలని ఎంచుకుంటూ వరుస విజయాల్ని తన ఖాతాలో వేసుకుంటున్నాడు యంగ్ హీరో సుహాస్. కథాబలమున్న సినిమాలతో నటుడిగా ప్రశంసలతో పాటు వరుస సక్సెస్‌లని సొంతం చేసుకుంటూ యంగ్ హీరోల రేసులో తనదైన పంథాలో దూసుకుపోతున్నాడు. షార్ట్ ఫిలింస్‌తో కెరీర్ ప్రారంభించి క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా, హీరో ఫ్రెండ్ పాత్రలతో ఆకట్టుకుంటూ వచ్చిన సుహాస్ కలర్ ఫోటోతో హీరోగా అరంగేట్రం చేయడం తెలిసిందే.కెరీర్ ప్రారంభం నుంచి కథాబలమున్న సినిమాలని ఎంచుకుంటూ హీరోగా తన ప్రత్యేకతని చాటుకుంటున్నాడు. రీసెంట్‌గా కీర్తిసురేష్‌తో కలిసి ఉప్పుకప్పురంబు సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చిన సుహాస్ త్వరలో 'ఓ భామ అయ్యో రామ' సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. రాము గోదాల దర్శకుడిగా పరిచయం అవుతున్న ఈ సినిమా జులై 11న థియేటర్లలోకి రాబోతోంది. దీనితో పాటు మరో రెండు సినిమాలు కేబుల్ రెడ్డి, ఆనందరావు అడ్వెంచర్స్‌లలో నటిస్తున్నాడు.ఇదిలా ఉంటే సుహాస్ మరో సారి విలన్‌గా కనిపించడానికి రెడీ అయిపోయాడు. గతంలో హిట్2లో సైకో విలన్‌గా నటించి ఆశ్చర్యపరిచిన సుహాస్ మరోసారి విలన్ అవతారం ఎత్తబోతున్నాడు. అది కూడా ఓ కమెడియన్ మూవీ కోసం. వివరాల్లోకి వెళితే.. విడుదలై సినిమాతో హీరోగా మారిన తమిళ కమెడియన్ సూరి హీరోగా మందాడ పేరుతో ఓ తమిళ మూవీ రూపొందుతోంది. ఇందులో సుహాస్ విలన్‌గా కనిపించబోతున్నాడు. ఈ విషయాన్ని ఇటీవల జరిగిన 'ఓ భామ అయ్యో రామ 'ప్రీ రిలీజ్ ఈవెంట్లో సుహాస్ వెల్లడించాడు.అభిమానుల సపోర్ట్‌తో తమిళ సినిమా 'మందాడి'లో విలన్‌గా పరిచయం అవుతున్నానని, ఇదే తన తొలి తమిళ సినిమా అని వెల్లడించాడు. అంతే కాకుండా ఇందులో హీరోయిన్‌గా నటిస్తున్న హీరోయిన్ మాళవిక తన స్నేహితుల క్రష్ అని తెలపడం విశేషం. ఇటీవల మందాడి ఫస్ట్ లుక్‌ని విడుదల చేయడం దానికి ప్రేక్షకుల నుంచి భారీ స్థాయిలో ఆదరణ లభించడం తెలిసిందే. హిట్ 2లో సైకో విలన్‌గా షాకింగ్ పెర్ఫార్మెన్స్‌తో అదరగొట్టిన సుహాస్ తమిళ మూవీ మందాడిలోనూ అదే తరహాలో ఆకట్టుకుని శభాష్ అనిపించుకుంటాడేమో వేచి చూడాల్సిందే.

# సితార నాగవంశీ.. మూడు సినిమాలతో నెవ్వర్ బిఫోర్ రిస్క్!



సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ అధినేత ఎస్. నాగవంశీ ప్రస్తుతం టాలీవుడ్‌లో మంచి స్పీడ్ మీద ఉన్న నిర్మాతల్లో ఒకరు. వరుస విజయాలతో నిర్మాతగా తన మార్క్ ప్రూవ్ చేసుకున్న నాగవంశీ.. ఇప్పుడు మరింత బిజీగా మారారు. ఒకవైపు తన బ్యానర్‌లో డజను సినిమాలు రూపొందుతుండగా, మరోవైపు డిస్ట్రిబ్యూషన్ రంగంలోనూ భారీగానే పెట్టుబడులు పెడుతున్నారు. ప్రత్యేకంగా చెప్పాలంటే, రాబోయే నెలలు నాగవంశీకి చాలా కీలకం కానున్నాయి.ప్రస్తుతం విజయ్ దేవరకొండ గౌతమ్ తిన్ననూరి కాంబినేషన్‌లో రూపొందిన కింగ్‌డమ్ రిలీజ్‌కు సిద్ధమవుతోంది. ఇది విజయ్ కెరీర్‌లోనే అత్యంత భారీ బడ్జెట్ మూవీగా నిలవబోతోంది. సైకలాజికల్ యాక్షన్ థ్రిల్లర్ నేపథ్యంలో ఈ సినిమా తెరకెక్కుతుండగా, జూలై 31న వరల్డ్ వైడ్ రిలీజ్ చేయనున్నారు. సినిమాకు మాస్ స్టైల్ కాంబినేషన్‌తో భారీ హైప్ క్రియేట్ అవుతోంది. ఇక ప్రమోషన్లు త్వరలో మొదలవనున్నాయి.ఇక కింగ్‌డమ్ తర్వాత మరో రెండు వారాల్లోనే నాగవంశీ డిస్ట్రిబ్యూషన్‌లో మరో బిగ్ మూవీ వార్ 2 విడుదల కానుంది. ఎన్టీఆర్ బాలీవుడ్ ఎంట్రీ మూవీ అయిన వార్ 2ను తెలుగులో నాగవంశీ భారీ ధరకు తీసుకున్నారు. ఆగస్టు 14న ఈ మూవీ థియేటర్లలోకి రానుండగా.. అదే రోజు రజినీకాంత్ 'కూలీ' కూడా రిలీజ్ కావడంతో మల్టీప్లెక్స్ స్క్రీన్ పరంగా టఫ్ పోరాటం జరగనుంది. అయినా నాగవంశీ పెద్ద స్కేల్ రిలీజ్ కోసం ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.ఇవే కాకుండా.. ఆగస్టు 27న మాస్ మహారాజా రవితేజ హీరోగా తెరకెక్కిన మాస్ జాతర సినిమా కూడా రిలీజ్ కానుంది. ఇది సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మిస్తున్న మరో భారీ మాస్ ఎంటర్టైనర్. కమర్షియల్‌గా బాగా హిట్ కావాల్సిన టైమింగ్‌లో వస్తున్న ఈ సినిమా రవితేజకు కూడా చాలా కీలకం. యూత్, బీ సెంటర్లలో ఈ సినిమా మంచి రెస్పాన్స్ దక్కిస్తే నాగవంశీకి మూడు వారాల గ్యాప్‌లో మూడు హిట్స్ కూడా రావచ్చు.ఇకపోతే ఈ మూడు సినిమాల మీద నాగవంశీ పెట్టిన పెట్టుబడి, మార్కెట్ వ్యాపారం మొత్తం భారీగానే ఉన్నట్లు సమాచారం. ఇది ఆయనకి నెవ్వర్ బిఫోర్ రిస్క్ లాంటిది. నిర్మాతగా 100 కోట్లకు పైనే పెట్టుబడులు పెట్టగా, డిస్ట్రిబ్యూటర్ గా 70 నుంచి 80 కోట్ల మధ్యలో రిస్క్ చేస్తున్నారు. కాబట్టి ఆయన కచ్చితంగా 200 కోట్లు టార్గెట్ పెట్టుకునే ఉంటారు. మూడు సినిమాలు విజయవంతమైతే భారీ లాభాలు వచ్చే అవకాశముంది. కానీ ఒక్క సినిమా ఎక్కడైనా తేడా కొడితే రిస్క్ ఎక్కువే. అందుకే ప్రమోషన్ల దగ్గర నుంచి థియేటర్ ప్లానింగ్ వరకు చాలా జాగ్రత్తగా ముందుకు వెళ్తున్నారు.



శ్రద్ధా కపూర్

# ఏంటి.. ట్రైలర్ లేకుండానే కూలీ విడుదల చేయబోతున్నారా..!



రజనీకాంత్ లీడ్ రోల్ లో ఆగస్ట్ 14న ప్రేక్షకుల ముందుకు రానున్న చిత్రం కూలీ. ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. తమిళనాడు చరిత్రలోనే ఈ మూవీ భారీ ఓపెనింగ్ రాబట్టే సినిమా అని బయ్యర్లు, డిస్ట్రిబ్యూటర్లు చెప్పుకుంటున్నారు. పాజిటివ్ టాక్ వస్తే.. రజనీకాంత్ మేనియా ముందు పోటీలో ఉన్న "వార్ 2" వంటి సినిమాలు కూడా ఏమాత్రం నిలబడలేవని అభిమానులు విశ్వసిస్తున్నారు. కోలీవుడ్ చిత్రరంగంలోనే కూలీ మొదటిసారి వెయ్యి కోట్ల క్లబ్‌లో చేరే అవకాశం ఉన్న చిత్రం అనే నమ్మకంతో ఈ సినిమా పై అభిమానులు ఆశలు పెట్టుకున్నారు.అయితే భారీ బజ్ సెట్ చేయడానికి సన్ పిక్చర్స్ సంస్థ కొన్ని సాహసోపేత నిర్ణయాలు తీసుకుంటున్నట్టు తెలుస్తుంది. ముఖ్యంగా, సన్ పిక్చర్స్ కూలీ చిత్రంకి సంబంధించి ఎలాంటి టీజర్ లేదా ట్రైలర్ విడుదల చేయకుండా డైరెక్ట్‌గా సినిమా రిలీజ్ చేయాలని అనుకుంటుందట. ఇదే నిజమైతే మాత్రం రిలీజ్ డేట్ దగ్గర పడే కొద్దీ హైప్ ఎక్కడికో వెళ్ళిపోతుంది. ఈ నిర్ణయంతో దర్శకుడు లోకేష్ కనగరాజ్ మరియు సన్ పిక్చర్స్ బృందం మధ్య కొన్ని చర్చలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. రజనీకాంత్, నాగార్జున, ఉపేంద్ర, అమీర్ ఖాన్ లాంటి స్టార్ కాంబో ఉన్నప్పుడు ప్రచారం అవసరం లేదేని మేకర్స్ భావిస్తున్నారట.ట్రైలర్ అన్నది సినిమా పట్ల భోజనానికి ముందు పెట్టే సలాడ్ లాంటిది, అంటే ప్రేక్షకుల ఎగ్జైట్‌మెంట్‌ను మరింత పెంచుతుంది. కానీ, కూలీ టీజర్ కూడా రిలీజ్ చేయకపోవడం వెనుక సన్ పిక్చర్స్ సాహసోపేత నిర్ణయమే తీసుకుంటుంది అని అంటున్నారు. ఇక కూలీ కోసం జూలై నెలాఖరున చెన్నై నెహ్రూ స్టేడియంలో ప్రీ-రిలీజ్ ఈవెంట్ ప్లాన్ చేసినట్లు సమాచారం. ఈ వేడుకలో టీజర్ లేదా ట్రైలర్ విడుదల చేసే అవకాశం ఉందా అన్నది చూడాలి. మరోవైపు, ఆగస్ట్ 7 హైదరాబాద్ లో కూడా ఒక వేడుకను ప్లాన్ చేస్తున్నారు. అయితే బయ్యర్లు, డిస్ట్రిబ్యూటర్లు మాత్రం టీజర్ లేదా ట్రైలర్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నారు, ఎందుకంటే చిత్రానికి తగిన ప్రమోషన్ ఉండాలి అని వారు అభిప్రాయపడుతున్నారు.

TELUGU RASTRAM . Printed, Published and Owned by A.RAJASEKHAR. Printed at Ajay Sri Printers, D.No. 4/151, Aithabathulavari centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P Published at D.No. 4-151, Aithabathulavari Centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P. Editor: A.RAJASEKHAR, . RNI NO. APTEL/2016/66202, email: telugurastram2016@gmail.com, Phone No. 8074368339